
	భద్రాద్రి జిల్లా	ఖమ్మం జిల్లా
మొత్తం పంచాయతీలు	471	571
మొత్తం వార్డులు:	4,168	5,214
మొత్తం పోలింగ్ కేంద్రాలు:	4,242	5,214
మొత్తం ఓటర్లు:	6,69,048	8,02,690
పురుషులు:	3,25,045	3,88,243
మహిళలు:	3,43,979	4,14,425
ఇతరులు:	24	22



పల్లెపోరు.. షురూ



పోలింగ్ సమయం
ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. ఆ వెంటనే ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు మోగిన నగారా

- మూడు విడతల్లో పోలింగ్
- రేపు నోటిఫికేషన్.. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- అమల్లోకి వచ్చిన నియమావళి
- సమరానికి సిద్ధమైన పార్టీలు

ఖమ్మం జిల్లాలో..

మండలం	పంచాయతీలు	వార్డులు
మొదటి విడతలో...		
బోనకల్	22	210
చింతకాని	26	248
కొణిజర్ల	27	254
మధిర	27	236
రఘునాధపాలెం	37	308
వైరా	22	200
ఎర్రుపాలెం	31	284
మొత్తం	192	1,740
రెండో విడత		
కామేపల్లి	24	218
ఖమ్మం రూరల్	21	202
కూసుమంచి	41	364
ముదిగొండ	25	246
నేలకొండపల్లి	32	300
తిరుమలాయపాలెం	40	356
మొత్తం	183	1,686
మూడో విడత		
ఏన్కూరు	25	216
కల్లూరు	23	214
పెనుబల్లి	33	298
సత్తుపల్లి	21	208
సింగరేణి	41	356
తల్లాడ	27	252
వేంసూరు	26	244
మొత్తం	196	1,788
మొత్తం	**571**	**5,214**

ఎన్నికల ప్రక్రియ ఇలా..

● మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో ఈనెల 27న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదే రోజు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై 29వరకు స్వీకరిస్తారు. 30వ తేదీన పరిశీలన ప్రక్రియ ఉంటుంది. డిసెంబరు 3వతేదీ ఉపసంహరణకు గడువు. 11వతేదీ పోలింగ్ , అదే రోజు సాయంత్రానికి ఫలితాల వెల్లడి ఉంటుంది.

● రెండో విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఈనెల 30వతేదీన నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణను ప్రారంభిస్తారు. డిసెంబరు 2వతేదీ వరకు స్వీకరణ జరుగుతుంది. ఇక 3వ తేదీన పరిశీలన జరగనుండగా ఆరోతేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 14న పోలింగ్, అదేరోజు ఫలితాలు వెల్లడిస్తారు.

● మూడో విడతలో ఎన్నికలు నిర్వహించే పంచాయతీల్లో డిసెంబరు 3న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆ రోజు నుంచి 5వతేదీ వరకు నామినేషన్లను స్వీకరించి.. 6వతేదీన పరిశీలన పూర్తి చేస్తారు. 9న ఉపసంహరణకు గడువు కాగా.. 17న ఎన్నికలు, ఫలితాలు వెల్లడవుతాయి.

ఖమ్మం (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/ కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి)/ ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 25: పల్లెల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది. ఎట్టకేలకు పంచాయతీ పోరుకు ముహూర్తం కుదిరింది. రిజర్వేషన్లపై ఏర్పడిన సందిగ్ధం నేపథ్యంలో ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయోనన్న చర్చల నడుమ.. 42 శాతం బీసీ రిజర్వేషన్లను పక్కన పెట్టి రిజర్వేషన్లు చేయడంతో ఎన్నికలకు ముందడుగు పడింది. తొలుత సెప్టెంబరులో గ్రామ పంచాయతీల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయగా.. రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు అభ్యంతరం తెలపడంతో ఆ షెడ్యూల్ తాత్కాలిక వాయిదా పడింది. దాంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ గత షెడ్యూల్‌ను సవరిస్తూ మంగళవారం రీ షెడ్యూల్ విడుదల చేసింది. అయితే మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నట్టు వెల్లడించడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు బ్రేక్ పడనుంది. మునిసిపల్ పట్టణాల్లో మాత్రమే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలుకానున్నాయి. అలాగే మునిసిపల్ ప్రాంతాల్లో మంత్రుల, ఎమ్మెల్యేల పర్యటనలు, అధికారిక కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంది. ఇక అభ్యర్థుల ఎంపికలో పార్టీలు బిజీగా మారాయి. సమావేశాలు నిర్వహిస్తూ గెలిచే వారి కోసం అన్వేషణ ప్రారంభించాయి. కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు, బీఆర్ఎస్, బీజేపీలు ఎన్నికల కదనరంగంలోకి అడుగుపెట్టబోతున్నాయి.

ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం

రిజర్వేషన్ల ప్రక్రియ ప్రారంభం అయినప్పటి నుంచే ఆశావహులు తమ ప్రయత్నాలు ప్రారంభించగా.. ప్రస్తుతం రీ షెడ్యూల్ విడుదలతో వారి ప్రయత్నాలు మరింత ముమ్మరం కానున్నాయి. అయితే రెండేళ్ల తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పాలన ప్రారంభ కానుంది. ఇప్పటికీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి రెండేళ్ల సమయం కాగా.. ప్రత్యేక అధికారుల పాలనలో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో, ఎవరి ఇంటి గడప తొక్కాలో తెలియని పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల ప్రజలు నానా అవస్థలు పడ్డారు. సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడొస్తాయోనంటూ కాలం వెళ్లదీశారు. కాగా మంగళవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ సారి ఎన్నికలకు ఎవరెవరు ఎంతెంత ఖర్చు చేయాల్సి వస్తుందోనంటూ ఆశావాహులు లెక్కలు వేస్తుండగా.. ఓటర్లు మాత్రం తమ ఓటు సాధారణ ఎన్నికల్లో ఎంత పలికింది.. ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో ఎంత పలుకుతుందోనంటూ చర్చను ప్రారంభించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి హామీలు ఇవ్వాలి.. తమకు కావాల్సిన పనులు ఎంటనే అంశాలపై ప్రజలు ఓ వైపు ఆలోచనల్లో నిమగ్నమవగా.. పార్టీలకు సంబంధించిన నేతలు మరోవైపు దానికి సంబంధించిన కసరత్తు చేసే యోచనను కొనసాగిస్తున్నారు. కాగా ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో పంచాయతీల నుంచి మండల, జిల్లాస్థాయి వరకు పండుగ వాతావరణం నెలకొనగా.. పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తర్వాత తాము ఎన్నుకోబడిన నేతల ద్వారా తమ సమస్యలు తీరడంతోపాటు, పల్లెలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఐదు పంచాయతీల్లో ఆగిన ఎన్నికలు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాజాగా వెలువడిన పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌లో ఖమ్మం జిల్లాలో ఐదు పంచాయతీలకు ఎన్నికలు జరగడం లేదు. ఏన్కూరు మండలంలోని ఏన్కూరు, ఆరికాయలపాడు, జన్నారం, నాచారంతో పాటు పెనుబల్లి మండలం గౌరారం గ్రామ పంచాయతీలకు ఎన్నికలను అధికారులు నిలిపివేశారు. నోటిఫికేషన్‌లో వాటిని మినహాయించి మిగిలిన పంచాయతీలను ప్రకటించారు. ఈ పంచాయతీలు పూర్వం మైదాన ప్రాంతమైన మధిర తాలూకాలో ఉన్నాయని ఈ గ్రామ పంచాయతీలను కూడా ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తించడం వల్ల సుమారు 40 గ్రామాలకు ఇబ్బందికరంగా మారిందని ఏన్కూరు మండలానికి చెందిన పలువురు రైతులు కోర్టును ఆశ్రయించారు. అప్పట్లో మధిర తాలూకాలో ఉన్న ఈ గ్రామాలపై విచారించాలంటూ అక్కడి గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. పంచాయతీ ఎన్నికలకు ముందే ఈ గ్రామాలను ఏజెన్సీ నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలంటూ వారు విజ్ఞప్తి చేయగా.. కోర్టులో అంశం పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ ఐదు పంచాయతీలకు ఎన్నికలను నిలిపివేసినట్టు తెలిసింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

మండలం	పంచాయతీలు	వార్డులు
మొదటి విడతలో...		
అశ్వాపురం	24	214
భద్రాచలం	01	20
బూర్గంపాడు	18	182
చర్ల	26	232
దుమ్ముగూడెం	37	324
కరకగూడెం	16	130
మణుగూరు	14	132
పినపాక	23	202
మొత్తం	159	1,436
రెండో విడత		
అన్నపురెడ్డిపల్లి	10	98
అశ్వారావుపేట	27	234
చంద్రుగొండ	14	134
చుంచుపల్లి	18	168
దమ్మపేట	31	290
ముల్కలపల్లి	20	186
పాల్వంచ	36	282
మొత్తం	156	1,392
మూడో విడత		
ఆళ్లపల్లి	12	90
గుండాల	11	96
జూలూరుపాడు	24	198
లక్ష్మీదేవిపల్లి	31	260
సుజాతనగర్	13	110
టేకులపల్లి	36	312
ఇల్లెందు	29	274
మొత్తం	156	1,340
మొత్తం	**471**	**4,168**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలు

- వడ్డీలేని రుణాల పంపిణీలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఐదు మండలాలకు చెందిన 4,782 సంఘాలకు రూ.4.91 కోట్ల అందజేత



మధిరలో స్వయం సహాయక మహిళలకు చెక్కు అందజేస్తున్న అనుదీప్

మధిర రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తూ, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం మధిరలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 4,782 మంది మహిళా సంఘాల సభ్యులకు రూ.4.91కోట్ల వడ్డీలేని రుణాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ప్రాధాన్యమిచ్చే క్రమంలో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మధిర నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.60కోట్లను మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందించామని, మధిర నియోజకవర్గ పరిధిలో ఇందిరా మహిళా డెయిరీని ఏర్పాటుచేసి 250 పాడి పశువులను పంపిణీ చేశామన్నారు. అనంతరం ఆయన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, ఆర్డీవో నర్సింహారావు, మధిర నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఐకేపీ ఏపీఎంలు, స్వయం సంఘాల గ్రూపుల మహిళలు పాల్గొన్నారు.

రామ రామ.. వీరి తీరు మారదా?

- ఆరంభం నుంచి అవే ఆరోపణలు
- తొలిసారి 'బయటి వస్త్రాల' ఘటన వెలుగులోకి
- కాంట్రాక్టర్‌కు నోటీసు.. పోలీసులకు ఫిర్యాదు



వస్త్రాలు పట్టుబడిన వస్త్ర సమర్పణ కేంద్రం ఇదే...



పట్టుబడిన వస్త్రాలు..

భద్రాచలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయంలో అవకతవకలు, అవినీతి ఆరోపణలు రావడం సర్వసాధారణంగామారింది. ఈ క్రమంలో ఆలయంలో భక్తులు సమర్పించే వస్త్రాలను విక్రయించే వారు సైతం అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలకు మంగళవారం ఆలయంలో జరిగిన ఘటన బలాన్ని చేకూరుస్తోంది. దశాబ్ద కాలంపైగా భద్రాచలంలో రామాలయాన్ని దర్శించే భక్తులు స్వామి వారికి సమర్పించే వస్త్రాలను విక్రయించేందుకు వేలంపాటను నిర్వహించడం జరుగుతోంది. అయితే వేలంపాటలో పాటను అధిక మొత్తానికి దక్కించుకున్న వారు తమదైన శైలిలో కొన్నేళ్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇంతకాలం ఆరోపణలకే పరిమితమైనా.. మంగళవారం వస్త్రాల ఘటన తొలిసారి వెలుగులోకి వచ్చిందని రామ భక్తులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో దేవస్థానం అధికారులు ఇలాంటి అనైతిక పనులకు చెక్ పెట్టి పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

అసలేం జరిగిందంటే....

ఆలయ ప్రాంగణంలోని వస్త్ర సమర్పణ కేంద్రంలో బయటి వస్త్రాలు ఉన్నట్లు దేవస్థాన స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) సిబ్బంది గుర్తించారు. మంగళవారం ఉదయం పడమర మెట్ల వైపు నుంచి కొబ్బరికాయల లైసెన్సుదారుని తరఫున పని చేస్తున్న ఓ మహిళ కవర్లో కొన్ని వస్త్రాలు తీసుకొచ్చి అవి భక్తులు సమర్పించినవని తెలుపుతూ ఫోన్ నెంబర్లతో సహా వస్త్రాల కాంట్రాక్టర్ తరఫున విధుల్లో ఉన్న తాతారావు అనే వ్యక్తికి అప్పగించారు. రామాలయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో అందిన సమాచారం మేరకు రామాలయం ఎస్‌పీఎఫ్ సిబ్బంది సీసీ ఫుటేజీల ఆధారంగా పలు సందేహాలు రావడంతో ఉద్దేశ్యపూర్వకంగానే బయటి వస్త్రాలు తరలించినట్టు గుర్తించినట్లు తెలుస్తోంది. వస్త్ర సమర్పణ కేంద్రంలోని కుర్చీలో ఒక కవర్‌ను గుర్తించగా అందులో ఒక చీర, నాలుగు పంచలు ఉన్నట్టు గుర్తించారు. ఇదే సమయంలో మిగిలిన రెండు కవర్లలో రెండు చీరలు, ఎనిమిది దోతీలు లభించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ సమయంలో వస్త్రాలకు ఎటువంటి బార్ కోడింగ్ లేకపోవడంతో పాటు భక్తులు ఇచ్చినట్లు (మిగతా 6వ పేజీలో)

ధాన్యం బస్తాలకోసం తరలొచ్చిన రైతులు

- తోపులాటలో ఓ రైతుకు గాయాలు

7

నేడు మహిళా అభ్యర్థులకు జాబ్‌మేళా

- జిల్లా ఉపాధి అధికారి శ్రీరామ్

7

బైక్‌లు చోరీ చేస్తున్న ముగ్గురి అరెస్టు

- ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నిందితులంతా మైనర్లు

పాల్వంచలో కొత్త విద్యుత్ ప్లాంట్లు

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర మంత్రి వర్గం
- కూల్చివేసిన పాత కర్మాగారాల స్థానంలో నిర్మాణం
- అంచనాలను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు
- ఫలించిన తుమ్మల, భట్టి, పొంగులేటి కృషి

పాల్వంచ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గతంలో కూల్చివేసిన పాల్వంచలోని కేటీపీఎస్ పాత ప్లాంట్ల స్థానంలో కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో పాల్వంచకు పూర్వ వైభవం రానుంది. ఆ దిశగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన కృషి ఫలించింది. మంగళవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంపై సుదీర్ఘంగా చర్చించారు. పాల్వంచ మండలంలో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించింది. అదే విధంగా ఎన్టీపీసీకి ఈ యూనిట్ నిర్మాణం అప్పగిస్తే విద్యుత్ రేటు ఎంత పడుతుంది? ఒక వేళ పాత పద్ధతిలో జెన్కో ద్వారా చేపడితే ఎంత పడుతుంది? అనే అంచనాలను సిద్ధం చేయాలని, తుది పరిశీలన చేయాలని ఆదేశించింది. కేటీపీఎస్ పాత ప్లాంట్ల కూల్చివేతతో పాల్వంచ పట్టణ అభివృద్ధి స్తంభించిందని, నూతన ప్లాంట్ల నిర్మాణంతో మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. క్యాబినెట్ నిర్ణయం తెలుసుకున్న పాల్వంచ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అతిత్వరలో జిల్లాకు రానున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ సందర్భంలోనే విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రకటన చేసే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.



నిరసనలో పాల్గొన్న జాన్‌వెస్లీ, పోతినేని, తదితరులు

రామారావు హంతకులను అరెస్టు చేయాల్సిందే..

- లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతాం
- సామినేని హత్యకేసుపై సమగ్ర విచారణ జరపాలి
- సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్, న్యూడెమోక్రసీ నేతల డిమాండ్
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా.. ఉద్రిక్తత
- హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, తదితరులు

6

స్వయం ఉపాధి దిశగా..

ఖమ్మంలో టీ స్టాల్ ప్రారంభించిన ట్రాన్స్‌జెండర్లు



టీస్టాల్ వద్ద ట్రాన్స్‌జెండర్లు, ఎస్‌హెచ్‌సీ సభ్యులు, టీఎంసీ గుడిపూడి సుజాత

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే తొలిసారిగా ఖమ్మం నగరంలో అర్ధనారీశ్వరి పేరిట ట్రాన్స్‌జెండర్ల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు జరిగాయి. పదిమంది ట్రాన్స్‌జెండర్లు సభ్యులుగా చేరారు. క్రమ పద్ధతిలో స్వయం సహాయక సంఘాన్ని (మిగతా 8వ పేజీలో)



ఫారం ఫాండ్‌ను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్

ఫారంఫాండ్ రైతులకు బహుళ ప్రయోజనాలు

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

చండ్రుగొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంట చేలల్లో మినీ ఫారం ఫాండ్‌లను నిర్మించుకోవాలని, తద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం మండలంలోని దామరచర్ల గ్రామంలో రైతు పొలంలో నూతనంగా తవ్విన మినీ ఫారం ఫాండ్(డెమో)ను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు తమ పంట చేనులో ఉన్న చెత్త కర్రల ముక్కలను ఈ మినీ ఫారం ఫాండ్‌లో వేసి కాల్చివేయడం వల్ల సేంద్రీయ ఎరువులా తయారు అవుతాయన్నారు. భూగర్భ జలాలతో పాటు భూ సాంద్రత కూడా పెరుగుతుందన్నారు. అందువల్ల రైతులు తప్పనిసరిగా ఫారంఫాండ్‌లను నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్, ఎంపీవో ఖాన్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



లారీలో నుంచి చీరలను దింపుతున్న దృశ్యం

భద్రాద్రి జిల్లాలో 2,13,374 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు

కొత్తగూడెం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2,13,374 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్లు డీఆర్డీవో విద్యాచందన తెలిపారు. మంగళవారం కొత్తగూడెం మున్సిపల్ కాంప్లెక్స్‌లో 25వేల ఇందిరమ్మ చీరలతో జిల్లాకు వచ్చిన లారీ చేరుకుంది. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆడబిడ్డలను గౌరవించేందుకు జిల్లాకు కేటాయించిన మొత్తం 2,13,374 ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మంగళవారంతో ముగిసిందన్నారు. జిల్లాలోని 952 గ్రామ సంఘాల్లోని 17,889 మహిళా సమాఖ్యల్లో 1,77,181మంది మహిళలతో పాటు 18 పైబడిన 36,193మంది గ్రామీణ యువతులకు ఈ నెల 21వ తేదీ నుంచి మంగళవారం వరకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశామన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ పచ్చిమోసం

» తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్



కామారెడ్డి డిక్లరేషన్ పత్రాలను చించివేస్తున్న నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసగించిన కాంగ్రెస్‌ప్రభుత్వంపై విరుచుకుపడేందుకు బీసీలు మహోద్యమానికి సన్నద్ధమవుతున్నారని తెలంగాణసాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యుడు జూలూరీ గౌరీశంకర్ పేర్కొన్నాను. బీసీల ఆశలను వమ్ము చేయడంపై బీసీలు గొంతు విప్పి పోరాటం చేసే సమయం ఆసన్నమైందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా మోసగించిన తీరును నిరసిస్తూ మంగళవారం ఖమ్మంనగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ముందు జ్యోతిరావుపూలే సావిత్రిబాయి పూలే విగ్రహాల వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో జూలూరు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలుచేస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ చెప్పిందేమిటిఇప్పుడు ఆచరణలో చేస్తుందేమిటని ప్రశ్నించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లూ ఇస్తూ విడుదల చేసిన జీవో 9ని వెనక్కి తీసుకుని తిరిగి జీవో 46ను విడుదలచేయడం దుర్మార్గమన్నారు. రాజ్యంగ సవరణ చేయకుండా షెడ్యూల్ 9లో చేర్చకుండా బీసీలకు రిజర్వేషన్లు రావని తెలిసి కూడా కాంగ్రెస్ బీసీలను మోసపుచ్చి గద్దెనెక్కిందన్నారు. ఎన్నికల్లో గెలవడానికి కామారెడ్డి డిక్లరేషన్‌విడుదల చేశారు కానీ వాళ్లకు బీసీల మీద ప్రేమలేదన్నారు. బీసీలు ఇక మోసపోవడానికి సిద్ధంగా లేరన్న విషయాన్ని పాలకులు తెలుసుకోవాలని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, పిండిప్రోలు రామ్మూర్తి, డాక్టర్ కేవీ కృష్ణారావు, మసనం శివరామకృష్ణ, గద్దె వెంకటరామయ్య, అమృతపుమల్లికార్జున్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

కొత్తగూడెం లీగల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పట్టుబడ్డ ఇద్దరికీ 10 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ. లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్‌డీపీఎస్ స్పెషల్ న్యాయాధికారి ఎస్. సరిత మంగళవారం తీర్పు చెప్పారు. భద్రాచలం టౌన్ అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ బి. మహేష్ 2020 సెప్టెంబరు 15న ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద మినీ గూడ్స్ వ్యాన్‌ను పరిశీలించగా 10 ప్లాస్టిక్ గంజాయి ప్యాకెట్లు 226.500 కిలోలు మొత్తం రూపాయల విలువ రూ.33,97,250 కలిగినవి లభ్యమయ్యాయి. ఒడిస్సా రాష్ట్ర మల్కానగిరి జిల్లాకు చెందిన సుజిత్ గోల్డర్, మనోజిత్ రాయ్‌లను అదుపులోకి తీసుకుని అప్పటి ఇన్‌స్పెక్టర్ స్వామి కేసు నమోదు చేశారు. కేసును విచారించిన దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో ముగ్గురు సాక్షులను విచారించారు. సుజిత్ గోల్డర్, మనోజిత్‌రాయ్‌పై నేరం రుజువుకాగా, ఇద్దరికీ పది సంవత్సరాల జైలు శిక్ష, ఇద్దరికీ లక్ష రూపాయల జరిమానా, జరిమానా చెల్లించని యెడల ఆరు నెలల సాధారణ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మీ నిర్వహించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్ఐ డి. రాఘవయ్య, లైజన్ ఆఫీసర్ ఎస్. వీరభద్రం (కోర్టు- డ్యూటీ ఆఫీసర్) పీసీ. సుధీర్‌బాబులు సహకరించారు.

రామారావు హంతకులను అరెస్టు చేయాల్సిందే..



ఖమ్మం కలెక్టరేట్‌లోకి చొచ్చుకొస్తున్న నాయకులు



కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నిస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

» సామినేని హత్యకేసుపై సమగ్ర విచారణ జరపాలి
» రాజకీయ ఒత్తిళ్లకు పోలీసులు లొంగొద్దు
» సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్, న్యూడెమోక్రసీ నేతల వెల్లడి
» ఖమ్మం కలెక్టరేట్ ముందు మహాధర్నా.. ఉద్రిక్తత
» పోలీసు వాహనాలను అడ్డుకున్న సీపీఎం కార్యకర్తలు
» కలెక్టరేట్ గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు యత్నం

ఖమ్మం,నవంబరు25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీపీఎం రాష్ట్రనాయకుడు పాతర్లపాడు మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్యకు కారకులైన హంతకులను గుర్తించి పోలీసులు అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సహాయ కార్యదర్శి పోతినేని సుదర్శన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ హెచ్చరించారు. రామారావు హత్య జరిగి నెలరోజులు సమీపిస్తున్నా.. నిందితులను గుర్తించి అరెస్టు చేయడంలో పోలీసులు వైఫల్యం చెందారని ఆరోపించారు. సీపీఎం నేత రామారావు హత్యచేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్, న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ముందు మహాధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. సీపీఎం కార్యకర్తలు, నాయకులు ఎర్రజెండాల చేతపట్టి నినాదాలు చేస్తూ కలెక్టరేట్ గేటు ఎక్కేందుకు ప్రయత్నించారు. అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసువాహనాలను అడ్డుకున్నారు. వాహనాల చక్రాల కింద కూడా పడుకున్నారు. అరెస్టు చేస్తే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు. పోలీసులు నాయకులను అరెస్టు చేయకుండా పక్కకు వెళ్లారు. దీంతో కలెక్టరేట్ ముందు ప్రధాన రహదారిపై బైఠాయించి రామారావు హత్య నిందితులను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగానినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహాధర్నాను ఉద్దేశించి రాష్ట్ర, జిల్లా నేతలు ప్రసంగించారు. రామారావు హత్యసంఘటనను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సీపీఎం రాష్ట్రసహాయ కార్యదర్శి పోతినేని సుదర్శన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు, బీఆర్ఎస్‌కు చెందిన మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ తదితరులు ప్రసంగిస్తూ.. నిందితులను పోలీసులు అరెస్టు చేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. హత్యకు పాల్పడింది కాంగ్రెస్ నాయకులని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని, అధికార పార్టీకి గులాంగిరి చేస్తున్నారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ రాజకీయ హత్య అని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు రామారావును హత్య సంఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. రామారావు సతీమణి ఇచ్చిన ఫిర్యాదుతో పాటు కేసులో పొందుపరిచిన కాంగ్రెస్ వారిని అరెస్టు చేయాలన్నారు. నిందితులను అరెస్టుచేసి న్యాయం జరిగే వరకూ పోరాటం సాగిస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పోలీసులపై ఒత్తిడి తెచ్చి అసలు నిందితులను అరెస్టు కాకుండా చూస్తున్నారని ఆరోపించారు. హత్యారాజకీయాలతో కమ్యూనిస్టు ఉద్యమాలను, ప్రజా ఉద్యమాలను నివారించలేరన్నారు. ఇప్పటికైనా పోలీసులు మాజీసర్పంచ్ రామారావు హత్యకేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిందితులను అరెస్టు చేయాలన్నారు. ఇది ముమ్మాటికి రాజకీయ హత్యేనన్నారు. కాగా.. కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా ఖమ్మం ఏసీపీ రమణమూర్తి ఆధ్వర్యంలో భారీపోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరావు, వై.విక్రమ్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



సత్తుపల్లి డిపోలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆర్ఎం సరిరామ్

» 'యాత్రాదానం'పై దాతలు ముందుకు రావాలి
» ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి సారించాం
» టీఎస్ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎం ఏ. సరిరామ్

సత్తుపల్లిరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో పలు పండుగల సందర్భాల్లో పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడిపించామని, రానున్న రోజుల్లో కూడా భక్తుల సౌకర్యార్థం ఆలయాలకు నడిపిస్తామని టీఎస్ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎం ఏ.సరిరామ్ అన్నారు. మంగళవారం ఆయన సత్తుపల్లి ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం సరిరామ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది డిమాండ్‌కు తగ్గట్లు ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను పెంచడంతో లాభాలు తగ్గాయని.. దీంతో ఖర్చులు పెరగడంతో ఓఆర్ తగ్గిందన్నారు. అందువల్ల ప్రస్తుతం ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి సారించామన్నారు. ఈ క్రమంలో ఆయా రూట్లలో ప్రయాణిస్తూ లాభనష్టాలు, ప్రయాణికుల సౌకర్యాలను తెలుసుకుని డ్రైవర్లు, కండక్టర్లకు సూచనలిస్తున్నామన్నారు. ఇదంతా నిరంతర ప్రక్రియ అని, ప్రయాణికులకు సేవలందిస్తూ సురక్షితంగా వారిని గమ్యస్థానాలకు చేర్చుతున్నామన్నారు. శబరిమలైకు ఖమ్మం నుంచి ఒక సర్వీస్ బుక్ అయిందని, ఇంకా వచ్చే అవకాశాలపై ఇప్పటికే ప్రచారాలు చేయిస్తున్నామని చెప్పారు.

దాతలు ముందుకు వచ్చి.. సంస్థకు సహకరించాలి

యాత్రాదానంపై కూడా అవగాహన కల్పిస్తుండగా దాతలు ముందుకు వచ్చి సంస్థను ఆదరించేందుకు తోడ్పాటును అందించాలని ఆర్ఎం ఏ.సరిరామ్ కోరారు. తీర్థయాత్రల సందర్శనలో భాగంగా వాడపల్లి, ద్వారకా తిరుమల, యాదాద్రి వంటి పుణ్యక్షేత్రాలకు భక్తుల దర్శనం కోసం ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని విలేకరులు కోరగా.. రూట్లను పరిశీలించి నడపాలని డీఎంను ఆదేశించారు. వాడపల్లి విషయంలో మాట్లాడుతూ.. తిరువూరు నుంచి వచ్చే బస్సులను ఎందుకు అనుమతి ఇస్తున్నారని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి ముందుగా బస్సు నడిపించాలని సూచించారు. అంతకుముందు డిపోలోని ఉద్యోగులు, కార్మికులతో మాట్లాడి.. పలు సూచనలు చేశారు. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులతో మాట్లాడి.. వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో డీఎం ఊటుకూరి సునీత, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, ఎస్ఎం ఆనందం, వీటీఓ కిన్నెర ఆనందరావు, కార్గో ఇన్‌చార్జ్ మునీర్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థి

అభినందించిన స్కూల్ సిబ్బంది, గ్రామస్థులు

దుమ్ముగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాపోటీలకు మండలంలోని కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి కొర్సా నాగేంద్రబాబు ఎంపికయ్యాడు. ఈనెల 22న కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఎంపికల్లో నాగేంద్రబాబు ప్రతిభ కనబర్చాడు. ఈనెల 27, 28, 29 తేదీల్లో కరీంనగర్ జిల్లా పెద్దపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో అతను పాల్గొంటాడు. కాగా.. విద్యార్థిని నాగేంద్రబాబును హెచ్ఎం పి. నర్సింహారావు, పీడీ హరికృష్ణ, పీఈటీ గంగరాజు, స్టాఫ్ సెక్రటరీ శివ, వార్డెన్ బాబూరావు, ఉపాధ్యాయులతో పాటు కొత్తపల్లి గ్రామస్థులు మంగళవారం అభినందించారు.

28న 'మీ డబ్బు, మీ హక్కు' పై శిబిరం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆడిటోరియంలో ఈ నెల 28న (శుక్రవారం) "మీ డబ్బు, మీ హక్కు" అనే లక్ష్యం తో ఉమ్మడి శిబిరం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా "మీ డబ్బు, మీ హక్కు" అనే లక్ష్యంతో క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి అక్టోబరు 4న గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జాతీయస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. క్లెయిమ్ చేసుకోని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా తదితరాలను క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని చేపట్టారని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామ రామ.. వీరి తీరు మారదా?

(5వ పేజీ తరువాయి)

భావించేలా ఒక్కొక్క కవర్లో ఒక్కొక్క సెల్ నెంబర్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ ఫోన్ నెంబర్లను సంప్రదించగా పొంతనలేని సమాధానాలు చెప్పినట్లుగా దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో వస్త్రాల విక్రయ కేంద్రం నిర్వాహకులను నిలదీయగా తమకు సంబంధించిన వారే ఇచ్చారని పేర్కొన్నట్లు దేవస్థానం వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.

కాంట్రాక్టర్‌కు నోటీసు..... పోలీసులకు ఫిర్యాదు

ఎస్‌పీఎఫ్ సిబ్బంది ఈ విషయాన్ని దేవస్థానం ఈవో దామోదర్‌రావు దృష్టికి తెచ్చారు. దీంతో దేవస్థానం అధికారులు అక్కడకు చేరుకొని పూర్తిస్థాయిలో విచారించి సిబ్బంది గుర్తించిన మూడు కవర్లను ఈవో కార్యాలయానికి తరలించారు. ఇదిలా ఉండగా ఈ ఘటనకు బాధ్యునిగా ఆరోపిస్తూ తక్షణమే వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ వస్త్రాల విక్రయ కేంద్రం కాంట్రాక్టర్‌కు నోటీసు జారీ చేసినట్టు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు వెల్లడించారు. అలాగే ఈ ఘటనపై నిజ నిర్ధారణ చేసేందుకు భద్రాచలం పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఈవో స్పష్టం చేశారు.

ఉమ్మడి జిల్లా వాలీబాల్ జూనియర్స్ జట్ల ఎంపిక

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూనియర్స్ వాలీబాల్ జట్లు ఎంపికలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలను కొత్తగూడెం ప్రకాశం మైదానంలో నిర్వహించగా ఇరు జిల్లాల నుంచి 50 మంది బాలికలు, 125 మంది బాలురు పాల్గొన్నారు. ఇరు జిల్లాల నుంచి బాలికలు 50 మంది బాలురు 125 మంది పాల్గొన్నారు. ఈ పోటీలో పాల్గొని ప్రదర్శన కనబరిచిన బాల, బాలికలకు జట్లను 11 మంది చొప్పున వేర్వేరుగా ఎంపిక చేశారు. ఈ ఎంపికలను ఉమ్మడి ఖమ్మం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రాన్ ఈ.రాజ రత్నాకర్‌రావు, అధ్యక్షుడు వి.నాగేందర్ కుమార్, జనరల్ సెక్రెటరీ గోవర్ధన్‌రెడ్డి, ట్రెజరర్ ఉస్మాన్, శ్రీనివాసరావు, సువర్ణబాబు, భద్రం, రామారావు నిర్వహించారు.

నివాళితో సరా?

» స్మారక మందిరం కరువు
» కీర్తనల ప్రచారంపై దృష్టి సారించని అధికారులు



భద్రాచలంలో తూము నరసింహదాసు నివసించిన గృహం (ఫైల్)

భద్రాచలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి సుప్రభాత సేవ నుంచి పవళింపు సేవ వరకు దశవిధ ఉత్సవాల రూపకర్త. అందుకు అనుగుణంగా కీర్తనలను రచించి వాటిని గానం చేసే నాందికి శ్రీకారం చుట్టిన మహనీయుడు భక్తరామదాసు తరువాత రామయ్యను అత్యంత భక్తితో కొలిచిన అపర భక్త రామదాసు. రామదాసు భద్రాద్రి క్షేత్ర ఆవిష్కర్త అయితే ఉత్సవాలతో భద్రగిరికి మరింత శోభ తీసుకొచ్చారు రాజా తూము లక్ష్మీ నరసింహదాసు. భద్రాద్రి రాముని సేవ కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా వదిలేసి రామ భక్తిలో తరిస్తూ తీర్థయాత్రలను చేస్తూ భద్రాచలానికి వచ్చి తన స్నేహితుడైన వరద రామదాసు సాయంతో ఆలయాభివృద్ధికి నడుం బిగించారు. అంతటి మహనీయుడిని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం అధికారులు తొలి నుంచి విస్మరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తరామదాసు తరువాత రామయ్యను కొలిచిన మహా భక్తుడైన నరసింహదాసు పేరిట ఒక స్మారక మం దిరం కానీ, ఆయన రచించిన అజరామరమైన కీర్తనలను ప్రచారం చేసిన దాఖలాలు కానీ లేవు. దశాబ్ద కాలం క్రితం మాడవీధుల అభివృద్ధి పేరుతో శతాబ్దాల కాలంగా ఉన్న తూము నరసింహదాసు నివసించిన ఇంటిని తొలగించారు. ఆలయ ప్రాంగణంలో భక్తరామదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, తూము నరసింహదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే సముచితంగా ఉంటుందనే అభిప్రాయం రామభక్తుల్లో ఉంది. కానీ ఆ దిశగా దేవస్థానం అధికారులు కసరత్తు చేయరు సరికదా కనీసం ఆలోచించకపోవడం రామ భక్తులను ఆవేదనకు గురి చేస్తోంది.

దర్బారు సేవకు దర్జా

దశవిధ ఉత్సవాల్లో అత్యంత కీలకమైంది దర్బారు సేవ. ఈ దర్బారుసేవ ప్రపంచంలో ఏ క్షేత్రంలో నిర్వహించని ప్రత్యేక సేవ. దర్బారు సేవతో రామచంద్రునికి దర్జాను తెచ్చారు నరసింహదాసు. మధురమైన కీర్తనలు రూపొందించి మరో రామదాసుగా ప్రసిద్ధిగాంచిన లక్ష్మీ నర్సింహదాసు ఇచ్చిన స్ఫూర్తితో 1998లో భద్రాద్రి రామయ్యకు 108 బంగారు పుష్పాలను చిన జీయర్‌స్వామి రామయ్య సేవకు సమర్పించారు. కాగా తూము నర్సింహదాసు చెక్కించిన శిలా శాసనాలు, రామ స్తంభం నేటికీ భద్రాద్రి ఆలయంలో దర్శనమిస్తాయి. ఆనాడు ఆచరించిన ఉత్సవాదులకి అక్షర రూపంగా దర్శనమిస్తున్నాయి.

నేడు లక్ష్మీనరసింహదాసు జయంతి

రాజా తూము లక్ష్మీనరసింహదాసు 235వ జయంతిని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారంనిర్వహించనున్నారు. ఉదయం లక్ష్మీనరసింహదాసు చిత్రపటంతో గిరి ప్రదక్షణ నిర్వహించి ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలో ప్రసాద వితరణ చేయనున్నారు. ఈ సమయంలో చిత్రకూట మండపంలో భజన కార్యక్రమం, కోలాటాలు, తూము నరసింహ దాసు వారి సంకీర్తన సేవ తదితర సంగీత కార్యక్రమాలను దేవస్థానం, రాజా శ్రీ తూము లక్ష్మీ నరసింహదాసు సంకీర్తన సేవా సంస్థ వారు నిర్వహించనున్నారు.

ఉత్సాహంగా 'యూనిటీ మార్చ్

» ప్రారంభించిన ఎంపీ వద్దిరాజు, బీజేపీ జాతీయ నాయకుడు సుధాకర్‌రెడ్డి



మార్చ్‌లో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు, బీజేపీ నేత సుధాకర్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏక్ భారత్-ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఉక్కు మనిషి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కేంద్ర యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో యూనిటీ మార్చ్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. మార్చ్‌ను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీ బీజేపీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత పటేల్ స్ఫూర్తితో దేశ భక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా క్రీడా మైదానాలలో తమ సత్తా చాటాలని ఆకాంక్షించారు. యువశక్తే భారత ఆత్మగా ఉందని ప్రపంచం మొత్తం మనవైపే చూస్తుందని అన్నారు. యువత దేశ గతిని మార్చే శక్తి అని ఉద్ఘాటించారు. దేశ సమైక్యత కోసం సర్దార్ పటేల్ చేసిన కృషిని వారు కొనియాడారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మార్చ్ స్థానిక సర్దార్‌పటేల్ స్టేడియం వద్ద ప్రారంభమై పెవీలియన్‌గ్రౌండ్ వద్ద ముగిసింది. ర్యాలీలో సుమారు వెయ్యి మంది ఓత్సాహికులు పాల్గొన్నారు. అనంతరం సామూహిక జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అన్వేష్, రాఘవరావు, రవిరాథోడ్, సైదేశ్వరరావు, విద్యాసాగర్ తదితరులున్నారు.

వ్యాసెక్టమి శస్త్రచికిత్సపై అవగాహన

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వ్యాసెక్టమీ శస్త్రచికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రామారావు తెలిపారు. శస్త్రచికిత్సల పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బందికి వ్యాసెక్టమి అవగాహన, శస్త్ర చికిత్సలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు విజయవంతం కావాలంటే పురుషుల భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బి. చందునాయక్, స్టాటస్టికల్ ఆఫీసర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖమ్మం జిల్లా వైద్యాధికారి రామారావు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ సూచించారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో నగదును కోల్పోయిన జూలూరుపాడు మండలానికి చెందిన సైబర్ క్రైమ్ బాధితుడు జ్యోతిబసుకు అతడు పోగొట్టుకున్న మొత్తం రూ.3.21 లక్షల నగదు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు, జూలూరుపాడు పోలీస్ అధికారుల సహాయంతో తిరిగి అతని ఖాతాలో జమ చేయించి ఆ ధృవపత్రాన్ని అందజేశారు. అనంతరం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ జ్యోతిబసు అనే ఆటో డ్రైవర్‌కి ఒక గుర్తు తెలియని వ్యక్తి గత నెలలో చుంచుపల్లి మండలంలోని ఒక పెట్రోల్ బంక్ వద్ద పరిచయమయ్యాడు. అతని సెల్ తీసుకొని మాట్లాడుతూ రూ.3.21 లక్షలు ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా మోసం చేశాడని తెలిపారు. కొంత సేపటితర్వాత నగదు పోగొట్టుకున్నానని గ్రహించిన బాధితుడు కొత్తగూడెం సైబర్ సెక్యూరిటీ బ్యూరోను సంప్రదించి ఫిర్యాదు చేశాడని తెలిపారు. తక్షణమే స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుల ఖాతాల్లోని బాధితుని డబ్బును ఫ్రీజ్ చేస్తారు. అనంతరం జూలూరుపాడు పోలీస్ అధికారుల సహాయంతో కోర్టు ఉత్తర్వుల ద్వారా బాధితుడికి తన సొమ్మును తిరిగి అతని ఖాతాలో జమ చేయించారు. కొత్తగూడెం సైబర్ క్రైమ్ డీఎస్పీ బి.అశోక్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జితేందర్, తదితరులు పాల్గొన్నారు.



బస్తాల కోసం వేచి ఉన్న రైతులు

ధాన్యం బస్తాలకోసం తరలొచ్చిన రైతులు

● తోపులాటలో ఓ రైతుకు గాయాలు

తల్లాడ, నవంబరు25(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మేందుకు అవసరమైన బస్తాల కోసం సొసైటీ కార్యాలయానికి రైతులు తరలివచ్చారు. ధాన్యం బస్తాల కోసం మంగళవారం తెల్లవారుజాము నుంచే తల్లాడ సొసైటీ కార్యాలయానికి పలు గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున తరలొచ్చారు. తల్లాడ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని అన్నారుగూడెం, గోపాలపేట, కొత్తవెంకటగిరి, బిల్లుపాడు, గొల్లగూడెం, పినపాక, తల్లాడ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించే రైతులకు బస్తాలను తల్లాడ సొసైటీ కార్యాలయం వద్ద పంపిణీ చేసే ప్రక్రియను చేపట్టారు. రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకుని కూపన్లు తీసుకుని బస్తాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈదశలో బస్తాలు వస్తున్నాయని సమాచారం తెలుసుకున్న రైతులు సొసైటీ కార్యాలయానికి వచ్చారు. 40వేల బస్తాలు మాత్రమే వచ్చాయి. సరిపడా రాకపోవడంతో బస్తాల కోసం రైతులు ఎగబడ్డారు. బస్తాల కోసం వేచి ఉన్న అన్నారుగూడెం గ్రామానికి చెందిన రైతు తాళ్లూరి జమలయ్యకు బుద్ధుని విగ్రహం తగిలి తలకు గాయమైంది. దీంతో కొందరు రైతులు బస్తాలు అందక నిరాశతో వెనుదిరిగారు.

యంగ్ ఇండియా పాఠశాలకు కేబినెట్ అనుమతి

దుమ్ముగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినబండిరేవు వద్ద ఇరవై ఎకరాల ప్రభుత్వ స్థలంలో సుమారు రూ.200కోట్ల టీఎస్ఈడబ్ల్యూఐడీసీ నిధులతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి అనుమతులు ఇస్తూ రాష్ట్ర క్యాబినెట్ మంగళవారం నిర్ణయం తీసుకుంది. అలాగే 20 ఎకరాల స్థలాన్ని నిర్మాణానికి కేటాయించారు. ఇప్పటికే టెండర్లు పూర్తయి, నిర్మాణ స్థలంలో భూమి చదును పనులు ప్రారంభం కాగా.. కేబినెట్ నిర్ణయంతో పనులు మరింత వేగవంతమయ్యే అవకాశాలున్నాయి. పాఠశాల నిర్మాణం పూర్తయితే ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ విభాగాలకు చెందిన 2,400 మంది విద్యార్థులకు పూర్తి సదుపాయాలతో కూడిన విద్యాబోధన అందుబాటులోకి రానుంది.

నేడు మహిళా అభ్యర్థులకు జాబ్‌మేళా

జిల్లా ఉపాధి అధికారి శ్రీరామ్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిరుద్యోగ యువతులకు ఉద్యోగాలు కల్పించేందుకు బుధవారం ఉదయం గాంధీచౌక్‌లోని కోటక్ మహీంద్ర బ్యాంకుపై గల రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో లైఫ్‌ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత గల వారికి నెలకు రూ. 20 వేల నుంచి50 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. మొత్తం 20 పోస్టుల భర్తీకి జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్హతల జిరాక్స్ కాపీలతో ఆసక్తి కలిగిన మహిళలు ఈ ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9393566588 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న పోలీసులు

బైక్‌లు చోరీ చేస్తున్న ముగ్గురి అరెస్టు

● ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం ● నిందితులంతా మైనర్లు

ఖమ్మం క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటు పడి ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న ముగ్గురు మైనర్ బాలురను ఖమ్మం టూటౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ముగ్గురు యువకులు మంగళవారం ద్విచక్రవాహనంపై వెళుతుండగా రాపర్తినగర్ వద్ద పెట్రోలింగ్ విధులలో ఉన్న పోలీసులకు పట్టుబడ్డారు. పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో.. పోలీసులకు అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా, పలు దొంగతనాలకు పాల్పడినట్టు పోలీసులకు తెలిపారు. ఇదే కోవలో వారు బైక్‌లు దొంగిలించిన విషయం చెప్పడంతో.. పోలీసులు రంగంలోకి దిగి ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ముగ్గురు బాలురిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఖమ్మంలో డ్రైనేజీలో పడి ఒకరి మృతి



మృతదేహాన్ని బయటకు తీసిన అన్నం శ్రీనివాసరావు

ఖమ్మం క్రైం,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పాల్వంచలోని సీతరామపట్నం ప్రాంతానికి చెందిన కొత్తపల్లి నరేందర్(33) అవివాహితుడు. పలు ప్రాంతాలు తిరుగుతూ పనులు చేసుకుంటూ ఉంటాడు. పనికి వెళ్లి వచ్చిన డబ్బులతో మద్యం తాగుతుంటాడు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం తాగిన మత్తులో నరేందర్ కొత్త బస్టాండ్ సమీపంలో ఓ డ్రైనేజీలో పడి మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నగర టూటౌన్ పోలీసులు.. సంఘటనా స్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆ తర్వాత అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా.. కుటుంబ సభ్యులు సోషల్ మీడియాలో నరేందర్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులను ఆశ్రయించారు.

అక్రమంగా మట్టి తోలుతున్న ఐదు లారీల పట్టివేత

ఖమ్మం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా మట్టి తోలకాలు నిర్వహిస్తున్న ఐదు లారీలను మంగళవారం పట్టుకున్నట్లు తహసీల్దార్ పలి రాంప్రసాద్ తెలిపారు. మండలంలోని కస్నాతండా, కాచిరాజుగూడెం గ్రామల పరిధిలో రెవెన్యూ, మైనింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే పెద్ద పెద్ద లారీల ద్వారా వందల కొద్దీ ట్రిప్పుల మట్టి తొలకాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజల ఫిర్యాదుల మేరకు రెవిన్యూ యంత్రాంగం రంగంలోకి దిగి మంగళవారం ఐదు లారీలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అక్రమంగా మట్టి తోలకాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా తహసీల్దార్ రాంప్రసాద్ హెచ్చరించారు.

దిగుబడులు రాక.. మద్దతు లేక..

» వర్షం దెబ్బకు ఈ ఏడాది పత్తి రైతు చిత్తు
» కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం
» భద్రాద్రి జిల్లాలో 2.10 లక్షల ఎకరాల్లో పత్తిపంట
» ఎకరానికి 4 క్వింటాలు మాత్రమే దిగుబడులు
» పేరుకు మాత్రమే సీసీఐ కొనుగోలు కేంద్రాలు
» మార్కెట్‌లో ప్రైవేట్ ట్రేడర్ల దందా
» రైతులను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



పత్తి పంట

కొత్తగూడెం వ్యవసాయం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది పొడుగున భారీగా వర్షాలు కురవడంతో పత్తి రైతులు చిత్తయ్యారు. ఓ వైపు దిగుబడి రాక.. మరోవైపు మద్దతు ధర లేక విలవిల్లాడిపోయారు. జిల్లాలో రైతులు ప్రతీ ఏడాది పత్తిపంట పైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ ఏడాది మొదట్లో పత్తిపంట వేసిన దగ్గరనుంచి కొంతవరకు ఆశాజనకంగా ఉన్నా.. వర్షాలు అధికంగా కురవడంతో ఏపుగా వచ్చిన పత్తి పంట పూత, కాత, కాయ రాలిపోవడంతో రైతుల పరిస్థితి రోజురోజుకూ దీనంగా మారిపోయింది. జిల్లాలోని పత్తి రైతులు ఎకరానికి రూ. 30 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఆ తర్వాత ఆ పెట్టుబడులు తీరక.. పత్తికి సక్రమంగా దిగుబడులు రాకపోవడం.. దీనికితోడు మార్కెట్‌లో సరైన మద్దతు ధర లేకపోవడంతో.. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు అల్లాడిపోతున్నారు. ఇక పత్తి కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. జిల్లాలో 2.10 లక్షల ఎకరాల్లో పత్తి పంటను వేస్తే.. అందులో సగభాగం కౌలు రైతులు పత్తి పంట వేశారని చెప్పొచ్చు. అసలే రైతులు ఒకపక్క కూలీల కొరతతో కొట్టుమిట్టాడుతున్నారు. పత్తి కలుపుల దగ్గర నుంచి పత్తి తీసే వరకూ.. రైతులపై కూలీల భారం మరింత పడుతోంది. కేజీ పత్తి తీసేందుకు ఒక్కొక్క కూలీకి 20 నుంచి 25 రూపాయలు ఇస్తున్నారు. దీనికి తోడు పత్తి పొలం వద్దకు కూలీలను చేరవేసేందుకు ఆటో చార్జీలు సైతం రైతులపైనే భారం పడుతోంది. దీంతో పాటు పొలం దుక్కిలు దుక్కిన దగ్గర నుంచి పత్తి పంటకు వేసే ఎరువులు, పురుగు మందులు, సుమారు రూ.30వేల నుంచి 35 వేల వరకు పెట్టుబడి పెట్టి ఉన్నారు. సొంత భూమి ఉన్న రైతులు ఈ విధంగా పెడితే.. ఆ భూమిని కౌలుకు తీసుకున్న రైతు, ఎకరానికి రూ. 25 వేల నుంచి 30 వేల వరకు కౌలు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో కౌలు రైతుకు ఎకరానికి సుమారు 60 వేల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే జిల్లాలో ఏడాది భారీగా కురిసిన వర్షాల కారణంగా పత్తి దిగుబడులు మరింతగా తగ్గిపోయాయి. ఎకరానికి కేవలం 3 నుంచి 4 క్వింటాళ్లు మాత్రమే దిగుబడులు వచ్చాయి. ఎకరం పత్తి ధర ప్రైవేట్ మార్కెట్‌లో రూ. 5 వేల నుంచి 5,500 మాత్రమే ఉంది. అయితే ఎకరానికి సుమారు 25వేల వరకు మాత్రమే రావడంతో రైతాంగానికి అపారనష్టం జరుగుతోంది. కౌలు రైతు మరింతగా ధరలేక, పెట్టుబడులు తీరక, దిగుబడులు రాక మరింత భారీగా నష్టపోయి, ఈ ఏడాది కౌలు చెల్లించలేక కుదేలయ్యే పరిస్థితి కౌలు రైతుకు దాపురించిందని చెప్పొచ్చు. ఇది ఇలా ఉంటే.. ప్రైవేట్ మార్కెట్‌లో పత్తి కొనుగోలు చేసే ప్రైవేట్ ట్రేడర్ల రాజ్యం దందా ఏలుతోంది. పత్తి తేమ ఉంటుందని, తేమ పేరుతో మార్కెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయకుండా వారి ఇష్టారీతిన క్వింటాకు రూ. 5,500 మాత్రమే కొనుగోలు చేస్తూ వారి దందాను నడిపించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలు పత్తి కొనుగోలు నామమాత్రంగానే కొనుగోలు చేస్తున్నారని చెప్పవచ్చు. సీసీఐలో మాత్రం పత్తిక్వింటాకు రూ.8 వేలకు పైగా మద్దతు ధర ప్రకటించారు. అయినప్పటికీ మద్దతు ధరను రైతాంగానికి చెల్లించలేకపోతున్నారు. పేరుకు మాత్రమే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ.. కొనుగోళ్లు మాత్రం చేపట్టకపోవడంతో రైతుల నుంచి పలు విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇంత జరుగుతున్న రైతాంగం గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి మద్దతు ధర, కౌలు, రైతుల నష్ట పరిహారం గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వర్షాలు నిండా ముంచాయి



వడ్డె వెంకటనారాయణ (కరివారిగూడెం, జూలూరుపాడు మండలం)

ఈ ఏడాది పది ఎకరాల్లో పత్తి సాగు చేశాను. వర్షాలు పత్తి రైతులను నిండా ముంచాయి. దీంతో ఎకరానికి 4 క్వింటాలు లోపు మాత్రమే దిగుబడులు వచ్చాయి. దీంతో తాను తీవ్రంగా ఈ ఏడాది పత్తి పంట మూలంగా నష్టపోయాను. చేతికొచ్చిన కొద్దిపాటి పంటను తీద్దామన్న కూలీలు దొరకకపోవడం. కిలో ఒక్కంటికి రూ.25 నుంచి 30 రూపాయలు చెల్లిస్తున్నాం. కూలీలు లేకపోవడం వల్ల పత్తి పొలంలో ఉన్న పత్తి నేలరాలిపోతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలి.

పత్తి పంట వల్ల నష్టపోయాను..



తప్పటి కృష్ణ (జూలూరుపాడు)

నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట ఈ ఏడాది సాగు చేసాను. కౌలు పెట్టుబడి కలిపి సుమారు 4 లక్షలు ఖర్చు అయ్యింది. ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవడంతో పత్తిపంట దెబ్బతినడం వల్ల ఎకరానికి మూడు క్వింటాల చొప్పున దిగుబడులు వచ్చాయి. పత్తి పంట విక్రయించిన కనీసం పెట్టుబడి కూడా రాలేదు. 2.50 లక్షలు నష్టం వచ్చింది. మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

పీఆర్పీ చెల్లింపులపై చర్చలు వాయిదా



మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైన సింగరేణి అధికారులు

» మంత్రి శ్రీధర్‌బాబుతో సింగరేణి అధికారుల సమావేశం
» ఉపముఖ్యమంత్రి భట్టితో జరగని సమావేశం
» వారం రోజులు వేచిచూసే ధోరణిలో అధికారులు

ఇల్లెందు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కాలరీస్ అధికారులకు వేతనాల్లో భాగమైన పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే(పీఆర్‌పీ) చెల్లింపులపై హైదరాబాద్‌లో సింగరేణి యాజమాన్యం మంత్రులతో జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి. సింగరేణి కాలరీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అత్యవసర పనుల కారణంగా ఢిల్లీ వెళ్లడం, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బిజీ షెడ్యూల్ కారణంగా కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ సింగరేణి విభాగం నాయకులతో హైదరాబాద్‌లో జరగాల్సిన చర్చలు నిలిచిపోయాయి. అయితే సింగరేణి అధికారుల సంఘం నాయకులు మంత్రి శ్రీధర్‌బాబును స్వయంగా కలిసి సింగరేణి అధికారుల సమస్యలను వివరించారు. అధికారుల డిమాండ్లపై ప్రభుత్వంలో తలెత్తిన సందేహాలపై సింగరేణి అధికారులు వివరణ ఇచ్చారు. దేశవ్యాప్తంగా కోల్ ఇండియా బొగ్గు ఉత్పాతక సంస్థలకు చెందిన అధికారులందరికీ ప్రతీ యేడు పీఆర్‌పీ చెల్లిస్తున్నప్పటికీ.. సింగరేణిలో ఏళ్ల తరబడి జాప్యం చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల పలుమార్లు సింగరేణి యాజమాన్యానికి వినతి పత్రాలు, విజ్ఞాపనలు సమర్పించినప్పటికీ సానుకూల నిర్ణయం వెలువడలేదన్నారు. మరో గత్యంతరం లేక ఈ నెల 24 నుంచి సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్‌ల కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు పాటించాలని తొలుత నిర్ణయం తీసుకున్నామని.. కానీ చర్చల కారణంగా హైదరాబాద్‌కు వచ్చినట్లు మంత్రి శ్రీధర్‌బాబుకు వివరించారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చిస్తానని, కేబినేట్‌లో సమావేశంలో పరిశీలిస్తామని అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కాగా.. సింగరేణి కాలరీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం అధికారుల సమస్యలపై చర్చించి ఈ నెల 30తేదీ వరకు ఆందోళనలు చేపట్టవద్దని, త్వరలోనే ప్రభుత్వం అధికారుల సమస్యల పరిష్కారానికి కృషిచేయనుందని తెలపడంతో.. అధికారుల సంఘం ఈ నెల 30వ తేదీ వరకు నిరాహార దీక్షలను తాత్కాలికంగా విరమించుకుంది.



నివాళులర్పిస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్

కోయగూడెంలో అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్య

అప్పుల బాధతో మనస్తాపానికి గురి కావడంతోనే..

బూర్గంపాడు, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక ఉరేసుకుని అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన కోయగూడెంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గంపాడు మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన బింగి కృష్ణవేణి(42) అనే మహిళ అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. భర్త ఆటో డ్రైవర్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల వీరికి అప్పులు కావడంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. విపరీతమైన అప్పుల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురైన కృష్ణవేణి.. సోమవారం రాత్రి తనింట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అర్ధరాత్రి ఇంటికి చేరుకున్న భర్త గమనించి స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతురాలు తల్లి కౌశల్య ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేశారు. కాగా.. కృష్ణవేణి మృతదేహానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రాజగోపురం నిర్మాణం కోసం సైకిల్‌యాత్ర

దుమ్ముగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):నరసాపురం చినఅరుణాచలంలో రాతిరాజగోపురం నిర్మాణం కోసం ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించారు. కొండగట్టు నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు పట్టణాల్లో తిరిగి బిక్షాటన చేస్తూ చిన అరుణాచలం చేరుకుంటారు. పెద్ద అరుణాచలం ఉత్తర గోపుర నిర్మాణం కొరకు బిక్షాటన చేసిన భక్తుడు అమ్మన్-అమ్మాన్ స్ఫూర్తితో తన యాత్రను ప్రారంభించానని స్వామి తెలిపారు. రాజగోపురం నిర్మాణం అనంతరం 2027లో పెదఅరుణాచలం నుంచి చినఅరుణాచలం వరకు 1008 కి.మీ మేర పాదయాత్ర, బిక్షాటన తలపెట్టానన్నారు.



కొండగట్టు ఆలయం నుంచి సైకిల్ యాత్ర చేపట్టిన శివనాగ స్వామి

వేర్వేరు ఘటనల్లో.. చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

దుమ్ముగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):వేర్వేరు సంఘటనల్లో చికిత్స పొందుతూ ఒక మహిళ, మరో విద్యార్థిని మంగళవారం మృతి చెందారు. ఈనెల 17న కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా నరసాపురం చినఅరుణాచలం శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ మంటలు అంటుకొని తీవ్రంగా గాయపడిన నామపల్లి కృష్ణవేణి(45) గుంటూరులో చికిత్స పొందుతూ మృతిచెందింది. పూజలో భాగంగా జలాభిషేకం చేస్తున్న క్రమంలో మండే స్వభావం గల థిన్నర్‌ను దీపాలపై చల్లడంతో మంటలు ఎగిసిపడి అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. కృష్ణవేణి ఏపీ రాష్ట్రం కూనవరానికి చెందినవారు. సీఐ వెంకటప్పయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో సంఘటనలో భాగంగా మంగువాయిబాడవలో నివాసం ఉంటున్న చత్తీస్‌ఘడ్ వలస ఆదివాసీ కుటుంబానికి చెందిన విద్యార్థిని(15) భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. వ్యక్తిగత కారణాలతో నాలుగు రోజుల క్రితం విద్యార్థిని పురుగుల మందు తాగింది. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. విద్యార్థిని కుంటలోని వసతిగృహంలో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ విషయమై తమకు సమాచారం లేదని పోలీసులు తెలిపారు. కాగా.. ఈ ఘటనలో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

సుజాతనగర్‌లో 'కిలాడీ' లేడీ?

» వరుస దొంగతనాలకు పాల్పడిన వైనం
» పెద్ద మొత్తంలో వెండి, బంగారు వస్తువుల మాయం
» పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించిన బాధిత కుటుంబం

సుజాతనగర్, నవంబరు 25 : సుజాతనగర్‌లో కిలాడీ లేడీ బాగోతంపై మండల ప్రజల నోళ్లలో మంగళవారం చక్కర్లు కొడుతోంది. సుజాతనగర్ వాసుల కథనం ప్రకారం.. సుజాతనగర్, వేపలగడ్డ పరిసర ప్రాంతాలలోని ఇళ్లల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ మహిళ వరుస దొంగతనాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీనితో ఓ కుటుంబంలో పెద్ద మొత్తంలో వెండి, బంగారు వస్తువులు మాయం కావడంతో అనుమానం వచ్చిన సదరు బాధిత కుటుంబం స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు ఆ కిలాడీ లేడీ, ఆమె కుటుంబ సభ్యులను అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం పోలీసులు అధికారికంగా ప్రకటన చేసే అవకాశం ఉంది.

విద్యుత్‌షాక్‌తో వివాహిత మృతి

బూర్గంపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో వివాహిత మృతి చెందిన విషాద ఘటన మంగళవారం పినపాకలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గంపాడు మండలంలోని పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన మేకల రమాదేవి(25) తన ఇంటి వద్దే కిరాణా షాపు నిర్వహిస్తోంది. రోజూలాగే మంగళవారం కూడా వ్యాపారం నిమిత్తం షాపు తెరిచే క్రమంలో తలుపును పట్టుకోగా.. విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. తలుపునకు ప్రమాదవశాత్తు కరెంటు సరఫరా కావడంతో.. ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా.. బతుకుదెరువు కోసం నడుపుకుంటున్న కిరాణాషాపే ఆ వివాహిత పాలిట యమపాశంగా మారింది. రమాదేవి మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. అందరితో కలిసి మెలిసి ఉండే ఆమె మరణవార్తను స్థానికులు జీర్ణించుకోలేక పోతున్నారు.



రమాదేవి (ఫైల్)



ఇసుక ర్యాంపు ప్రాంతంలో మహిళల తోపులాట

ఇసుక ర్యాంపు వద్ద మహిళల ఘర్షణ

మణుగూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని అన్నారం ఇసుక ర్యాంపు వద్ద మంగళవారం మహిళలు ఉపాధి కోసం ఘర్షణకు దిగారు. అనంతారం, కొమ్ముగూడెం అన్నారం కమలాపురం గ్రామాలకు చెందిన సొసైటీ మహిళలు వాయిదాల పద్ధతిలో ఉపాధిని పొందుతున్నారు. ఈ క్రమంలో ఉపాధి తమకంటే తమకు అంటూ.. మూడు గ్రామాల మహిళా సభ్యులు వాగ్వాదానికి దిగి ఒకరినొకరు నెట్టివేసుకున్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మహిళల మధ్య జరిగిన ఈ తోపులాట వల్ల ఇసుక ర్యాంపు నిర్వహణకు అడ్డంకిగా మారింది. దీంతో అధికారులు, నిర్వాహకులు ఈ ర్యాంపును తాత్కాలికంగా నిలిపివేశారు.

హత్యాయత్నం ఘటనలో ముగ్గురి అరెస్టు

అశ్వారావుపేట రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమికి సంబంధించిన వివాదంలో కత్తులతో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై యయాతిరాజు వివరాలు వెల్లడించారు. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన గేదెల విష్ణుమూర్తి, అతని కుమారుడు సురేశ్, మనువడు వినయ్‌లు సోమవారం అదే గ్రామానికి చెందిన మంగ గణేశ్, మంగ వెంకటేశ్వర్లుపై భూవివాదం నేపథ్యంలో కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం గేదెల విష్ణు, సురేశ్, వినయ్‌లను అరెస్ట్ చేసి దమ్మపేట కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించటంతో సత్తుపల్లి జైలుకు తరలించారు. సమావేశంలో ఎస్ఐ అఖిల, సిబ్బంది ఉన్నారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై యయాతి రాజు



సాగర్ రెండో జోన్‌కు సాగునీటి ప్రణాళిక ప్రకటించాలి

ఖమ్మం అర్బన్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సాగర్ రెండో జోన్‌లో ఎన్ఎస్‌పీ అధికారులు సాగునీటి ప్రణాళిక ప్రకటిచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంతవరకు నీటి ప్రణాళిక ప్రకటించకపోవడంతో ఆయకట్టు రైతులు అయోమయంలో పడ్డారన్నారు. వానాకాలం పంటల కోతలు పూర్తి కావొస్తుండటంతో రెండవ పంటలకు నీటి విడుదలపై స్పష్టత ఇస్తే, అందుకు అనుగుణంగా రైతులు సమాయత్తం అవుతారన్నారు. జిల్లాలో సాగర్ రెండవ జోన్‌లో సుమారు 2.55 లక్షల ఎకరాల్లో రైతులు యాసంగి సాగు చేస్తారని ఇందుకు 32 టీఎంసీల నీరు అవసరం ఉంటుందన్నారు. ఎన్ఎస్‌పీ అధికారులు ఆలస్యం చేయకుండా ఇకనైనా ప్రణాళిక ప్రకటించాలన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ గొప్పతనాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తించడంలేదు

» మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశాన్ని ఏకం చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని స్మరించుకుంటూ నిర్వహించిన యూనిట్ ఆఫ్ మార్చ్ కార్యక్రమానికి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు మొహం చాటేయడం వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని బీజేపీ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కో ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ యూనిటీ ఆఫ్ మార్చ్ అనే కార్యక్రమం ఒక పార్టీకి సంబంధించింది కాదని, దేశవ్యాప్తంగా పార్టీలకు అతీతంగా జరుగుతున్న జాతీయ కార్యక్రమమన్నారు. జిల్లాలో మంత్రులు, అధికార యంత్రాంగం ఉండి కూడా యూనిటీ ఆఫ్ మార్చ్‌కు రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. మజ్లిస్‌పార్టీకి భయపడి ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ నేతలు పటేల్ గొప్పతనం గుర్తించడంలేదన్నారు. దేశవ్యాప్తంగా వందేమాతరం గీతాన్ని గౌరవిస్తుంటే తెలంగాణలో మాత్రం మజ్లిస్ మెప్పుకోసం దానిని పక్కన పెడుతున్నారని ఆరోపించారు. అదేవిధంగా రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసి ఫీచర్ సిటీ వంటి ఆకర్షణీయమైన పేర్లతో కాంగ్రెస్ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుందన్నరు. పంచాయతీ ఎన్నికల్ల బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ద్రోహం చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరావు, రమేష్, నంబూరి రామలింగేశ్వరావు, కొత్త వెంకటేశ్వర్లు, మందడపు సుబ్బారావు, నాయుడు రాఘవరావు, రవిరాథోడ్ ,వీరెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భయం లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలి

నేలకొండపల్లి, నవంబరు25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని పోగొట్టుకోవాలని ఎంఈవో బాలిన చలపతిరావు సూచించారు. ఇన్‌స్పైయిర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో జరిగిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ డైరెక్టర్స్ దాసరి రంజిత్, శ్రీరామ్, సుధాకర్, పర్సనాలిటీ డెలప్‌మెంట్ శిక్షకులు ప్రవణ్, సురేంద్ర, నవీన్, మనోజ్, షరీఫ్ పాల్గొన్నారు.

బీసీలపై రాజకీయ వివక్ష దుర్మార్గం

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): బీసీలపై రాజకీయ వివక్షత దుర్మార్గమని, బీసీలకు 22శాతం రిజర్వేషన్లను పటిష్టంగా అమలుచేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర నాయకుడు గుండాల కృష్ణ , మేకల సుగుణారావు అన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీలకు 22శాతం రిజర్వేషన్లు అమలుచేయకుండా 11.7శాతం అమలు చేసేందుకు ప్రయత్నిస్తూ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో పిట్టల నాగేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, పెరుగు వెంకటరమణ, గీత, హనుమంతు, చైతన్య తదితరులున్నారు.

అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పది

» మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పదానం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తీర్థాల సంఘమేశ్వరాళయంలో కాంగ్రెస్ నాయకులు తేజావత్ పంతులు నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్పస్వాములకు మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, తోట వీరభద్రం, బోసిరెడ్డి, మాధవరెడ్డి, కిషోర్ రెడ్డి, గురుస్వామి యుగంధర్, శివ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో 'న్యూవిజన్' విద్యార్థి ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల హాలియాలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో తమ కళాశాలలో ఇంటర్ చదువుతున్న కట్టా స్నేహిత్ ప్రతిభ చూపి ప్రథమ స్థానం సాధించాడని కళాశాల చైర్మన్ సీహెచ్. జీకే ప్రసాద్ తెలిపారు. అంతేకాకుండా గతంలో సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలలో సైతం ప్రథమ స్థానంలో నిలిచాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆయన అభినందించారు.



స్నేహిత్‌ను అభినందిస్తున్న కళాశాల అధినేత ప్రసాద్

కేఎంసీలో ఉద్యోగుల హాజరు కష్టాలు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రూ.కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి, పరిపాలనలో ఖమ్మం నగర పాలక సంస్థ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. అయితే కేఎంసీలోని ఉద్యోగుల హాజరు పారదర్శికత కోసం కమిషనర్ అభిషేక్ ఆగస్త్య మొఖ హాజరును అమలులోకి తీసుకొచ్చారు. మొత్తం 300 మంది వరకు అన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతలు నిర్వహిస్తారు. సిబ్బందికి తగిన స్థాయిలో మాత్రం మొఖ హాజరు పరికరాలను ఏర్పాటు చేయలేక పోయారు. దీంతో ఉదయం, సాయంత్రం సమయంలో 30నిమిషాల పాటు ఉద్యోగులు నిరీక్షించి హాజరు నమోదు చేస్తున్నారు. సాయంత్రం సమయంలో రాత్రి 7 గంటల వరకు పనిచేసిన ఉద్యోగులు సైతం క్యూలో ఉండి హాజరు నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కమిషనర్ అభిషేక్ ఆగస్త్య స్పందించి అదనంగా ముఖ హాజరు మిషన్లు ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కొరుతున్నారు.



హాజరు నమోదు కోసం నిరీక్షిస్తున్న ఉద్యోగులు

ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం

» మేయర్ పునుకొల్లు నీరజ

రఘునాథపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళా ఆర్థిక, సామాజిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మంగళవారం రఘునాథపాలెం రైతు వేదికలో మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలను మేయర్ పునుకొల్లు నీరజ మంజూరు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళలను వృత్తి, వ్యాపార రంగాల్లో ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలేని రుణాల పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ప్రతి మహిళ స్వయం సహాయక సంఘం సభ్యులుగా చేరి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను పొందాలని ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించొద్దని కోరారు. వ్యవసాయానికి కేవలం వర్షాధారంపై ఆధారపడిన రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా 34 చెర్వులకు నాగార్జున్ సాగర్ జలాలను అందించి రాష్ట్రంలోనే శశ్యశ్యామల సాగునీటి ఎద్దడి లేని మండలంగా మార్చారని వివరించారు. ఖమ్మంనగరంలో ఉన్న ప్రాంతాలను మండలంగా విభజన చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా మంజూరు జరిగేలా రఘునాథపాలెం మండలంగా మార్చిన ఘనత రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకే దక్కిందన్నారు. ప్రతి మహిళ కోటీశ్వరురాలిగా మార్చేందుకు ఆర్థికంగా మహిళలను ప్రోత్సహించటం జరుగుతుందన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణించే అవకాశం కల్పించిందన్నారు. ఉచిత విద్యుత్ సౌకర్యం మహిళల కోసం అమలు చేయటం జరిగిందన్నారు. ఎన్నికల మ్యానిపెస్టోలో లేని సన్నబియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న అభివృద్ధిని వివరించారు. కార్పొరేటర్లు కొత్తపల్లి నీరజ, కన్నం వైష్ణవి, గజ్జల లక్ష్మి, తహసిల్దారు శ్వేత పాల్గొన్నారు.

కూసుమంచి: మహిళల ఆర్థిక స్వాలంబనకోసమే రాష్ట్రప్రభుత్వం వడ్డీలేని రుణాలు పంపిణీ చేస్తుందని అడిషనల్ కలెక్టర్ శ్రీజ తెలిపారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో కూసుమంచిలో ఎస్సార్ ఫంక్షన్‌హాల్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు రూ.4.6కోట్ల విలువైన వడ్డీలేని రుణాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా శ్రీజ మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ పెద్ద పీట వేస్తు తెలిపారు. అందులో భాగంగానే వడ్డీలేని రుణాలు అందిస్తుందన్నారు. అదేవిధంగా మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు మంజూరీ చేస్తుందన్నారు. దీనిమీద వచ్చే లాభాలను మహిళల ఆర్థికాభివృద్ధి సాధించొచ్చన్నారు. అలాగే ఉచిత బస్సు, రైతుభరోసా, రుణమాఫీ, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇలా అనేక సంక్షేమపథకాలు అమలు చేస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకొని లక్షాధికారులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో జశ్వంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచిలో రుణాలు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ



ఖమ్మంలో చెక్కులను పంపిణీ చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

న్యాయవాదుల సంక్షేమమే ఎజెండాగా పని చేయాలి



ప్రచారంలో మాట్లాడుతున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది రఘునాథ్

ఖమ్మం లీగల్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది వి.రఘునాథ్ అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఖమ్మం బార్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ యువ న్యాయవాదులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం, హెల్త్‌కేర్ బెనిఫిట్స్ న్యాయవాదుల రక్షణచట్టం కోసం ముందుండి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో న్యాయవాదుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్న బార్ కౌన్సిల్ మెంబర్లను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి బార్ కౌన్సిల్ మెంబర్‌గా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నూతనంగా ఎన్నికైన బార్ కౌన్సిల్ మొట్టమొదటిగా చేసే పని న్యాయవాదుల రక్షణచట్టం వచ్చేవరకు వెనకడుగు వేయకుండా పోరాడుతుందన్నారు. బార్, బెంచ్ మధ్యగల సంబంధాన్ని ఆరోగ్యకరంగా ఉండేవిధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. మహిళా న్యాయవాదులకు బార్ కౌన్సిల్లో తగిన స్థానం కల్పించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. న్యాయవాదుల సంక్షేమనిధి అవసరాలు, పరిస్థితుల్నిబట్టి ముందుగానే తీసుకునే వెసులుబాటు కల్పించడానికి కృషిచేస్తుందని హామీ ఇచ్చారు. హెల్త్‌కేర్ ఫండ్‌ను ఇప్పుడు ఉన్న దానికన్నా పెంచడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

» స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, స్థానిక సంస్థల ఎన్నికల నోడల్ అధికారులతో మంగళవారం ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ప్రతి అధికారి ఎన్నికల నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎఫ్ఎస్‌టి టీములు, జోనల్ అధికారులు, రూట్ అధికారులకు ఎన్నికల విధుల నిర్వహణకు కావాల్సిన వాహనాల ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల అవసరాన్ని బట్టి ఏర్పాట్లు ఉండాలన్నారు. రవాణా, విద్యాశాఖ, పంచాయతీశాఖలు వాహనాల ఏర్పాట్లపై సమన్వయం చేసుకోవాలన్నారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి లకు సంబంధించి 15 బృందాల ఏర్పాటు చేయాలన్నారు. మండల అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసుకొని బృందాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది భోజనాలు, టీఏ లపై ఖర్చుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక చేయాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు చేది, ఖర్చుపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నోటిఫికేషన్ నాటి నుండి ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల సామాగ్రి సేకరణ పూర్తిచేయాలన్నారు. పీవో, ఏపీవో ల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిబంధనల మేరకు చేపట్టాలన్నారు. శిక్షణా కార్యక్రమాలు పకడ్బందీగా పూర్తిచేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలన్నారు. జిల్లా కేంద్రంలో ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ ముద్రణకు చర్యలు తీసుకోవాలని, అవి ఎట్టి పరిస్థితుల్లో బయటకు పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యం లో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలన్స్ బృందాలు మరింత విస్తృతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, ఎంవీఐ వెంకటరమణ,సీపీవో ఏ. శ్రీనివాస్, ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, డీసీవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఎన్నికల అధికారి ఎంపీడీవో ను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశా రు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి ఎటు వంటి చర్యలు తీసుకున్నది అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణలో లోపాలు ఉండకూడదన్నారు. ఎంపీడీవో ఎర్రయ్య, ఎంఈవో చలపతిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

'త్రివేణి'లో మాక్ పార్లమెంట్



మాక్ పార్లమెంటులో పాల్గొన్న విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని త్రివేణి పాఠశాలలో మాక్ పార్లమెంటును నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి మాతృభాషతోపాటుగా జీవనోపాధికి అవసరమైన ఆంగ్ల భాషను అజెండాగా తీసుకొని.. ఎగువ సభ దిగువ సభలను విద్యార్థినీ విద్యార్థుల చేత నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి -త్రివేణి విద్యాసంస్థల అధిపతి వెంకటేశ్వరావు, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళా ప్రాంగణం, దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రం, టేకులపల్లి, ఖమ్మం నందు ఉచిత ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్ఎం శిక్షణకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం అధికారి వేల్పుల విజేత తెలిపారు. 2025-2027 విద్యాసంవత్సరమునకు మొదటి సంవత్సరంలో ప్రవేశం నిమిత్తం ఇంటర్మీడియట్ పూర్తి చేసిన (ఏ గ్రూపు వారైనా సరే) 17 సంవత్సరాలు నిండి ఉన్నవారు అర్హులని తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 28లోగా అందించాలని తెలిపారు. విద్యార్థినులు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా తెలిపారు. వివరాలకు మహిళా ప్రాంగణంలో సంప్రదించాలని తెలిపారు.

వ్యవసాయకూలీలకు సమగ్ర చట్టం తేవాలి

తిరుమలాయపాలెం, నవంబరు25(ఆంధ్రజ్యోతి):వ్యవసాయకూలీలకు సమగ్ర చట్టం తేచ్చి వారిని అన్నివిధాలా ఆదుకోవాలని మాస్‌లైన్ రాష్ట్రనాయకుడు గుమ్మడి నరసయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని దమ్మాయిగూడెంలో ఏఐపీకేఎంఎస్ ఖమ్మంజిల్లా ప్రథమమహాసభజరిగింది. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 50శాతం వ్యవసాయకార్మికులున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కూలీలందరికీ రూ.12వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయాన్నారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్.శివలింగం, ఎస్.వెంకటేశ్వర్లు, శ్రీను, బండెల వెంకయ్య, కె.నాగేశ్వరారవు అప్పారావు, హనుమంతరావు, వెంకటరెడ్డి, నరేష్, యాదగిరి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

తిరుమలాయపాలెం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఏవో సీతారాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, పురుగు ముందుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. దుకాణాలలో అనుమతి ఉన్న ఎరువుల, మందులు విక్రయించాలన్నారు. దమ్మాయిగూడెం రైతువేదికలో జాతీయ ఆహారభద్రతపథకం కింద 50శాతం సబ్సిడీపై వరి విత్తనాలు అందించారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు నవనీత, కృష్ణ, ప్రదీప్, సాధన పాల్గొన్నారు.

మహిళలను మోసం చేస్తున్న కాంగ్రెస్

నేలకొండపల్లి, నవంబరు25(ఆంధ్రజ్యోతి): చీరెల పంపిణీ పేరుతో కాంగ్రెస్ సర్కార్ మహిళలను మోసం చేస్తున్నదని జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు మరికంటి ధనలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత పదేళ్లుగా కేసీఆర్ మహిళలకు బతకమ్మ చీరెలిచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇంత వరకు మహిళలకు చీరెలివ్వలేదని, పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు మహిళలకు చీరల పంపిణీ ప్రారంభించారన్నారు. చీరలు కేవలం డ్వాక్రా మహిళలకే అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని, అదే నిజమైతే మిగిలిన మహిళల సంగతేంటని ప్రశ్నించారు. ప్రతి నెలా మహిళలకు రూ.2,500 ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీకి నేటికీ దిక్కులేదన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోతే మహిళలు తిరగబడతారని హెచ్చరించారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం అధికారంలో ఉండటంతో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్‌లోని ప్రకాశ్‌నగర్‌లో లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో రాష్ట్రంలోనే అత్యధిక ప్రభుత్వ సహాయం ఖమ్మం నియోజకవర్గంలో అందుతుందన్నారు. నాయకులు గజ్జల వెంకన్న, డివిజన్ అధ్యక్షుడు కలిమెల భద్రయ్య, సముద్రాల శ్రీనివాస్, అంకాల వీరభద్రం, జహీర్, సతీష్,వర్మ, బాశెట్టి నాగేశ్వరరావు,ఉప్పిరెడ్డి, గడుదుల వెంకటేశ్, గంగరబోయిన రవి, పోతుల నర్సింహారావు, నాగరాజు, బాబు, చిర్ర వెంకన్న పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం అమలు, ఎన్సీటిఈ నోటిఫికేషన్ కి పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఈటీ) నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) పిలుపు మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) జిల్లా కార్యాలయం నుంచి ప్రధానమంత్రి కార్యాలయానికి గ్రివెన్స్ పోర్టల్ ద్వారా మెమోరాండం సమర్పించామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. దేశవ్యాప్తంగా 25 లక్షల మంది, రాష్ట్రంలో 45 వేలమంది, జిల్లాలో 2వేల మంది ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తుందన్నారు. చట్టాన్ని సవరించి సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలను చూపుతున్న అధికారులు

ఖమ్మం క్రైం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): జిల్లా కారాగారంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ కు వయోజన విద్య పుస్తకాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు అనిల్ మాట్లాడుతూ నిరక్షరాస్యులైన ఖైదీలందరూ సంపూర్ణ అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా పుస్తకాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సక్రూ, హనుమంతరావు, సుభాష్, సురేష్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి దిశగా ట్రాన్స్‌జెండర్లు

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. ఒక్కో ట్రాన్స్‌జెండర్‌కు రూ.30వేల చొప్పున రూ.3లక్షల వరకు మంజూరయ్యాయి. వారు సరైన రీతిలో బ్యాంకు రుణాలు చెల్లించటంతో ఆ ట్రాన్స్‌జెండర్ల సంఘానికి రూ.6లక్షల రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకొస్తున్నారు. వీరిలో ఒక ట్రాన్స్‌జెండర్ ఆటో కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతుండగా మరో ట్రాన్స్‌జెండర్ శ్రావణి టీ స్టాల్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం శ్రావణి టీ స్టాల్‌ను ప్రారంభించారు. మిగతా 8మంది వివిధ వ్యాపారాలు చేసుకుంటున్నారు. కాగా ఆయా సంఘంలోని సభ్యులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకం, బ్యాంకర్ల సహకారంతో స్వయం ఉపాధి పొందుతున్నామని, ఖమ్మం మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకు రుణాలు మంజూరు కావటంతో సమాజంలో తమకు మంచి గుర్తింపు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎస్కే సల్మా పాల్గొన్నారు.

జిల్లా కారాగారంలో పుస్తకాల పంపిణీ



ఖమ్మం క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కారాగారంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా జైలు సూపరిడెంటెట్ శ్రీధర్ కు వయెజన విద్య పుస్తకాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వయెజన విద్యాశాఖ ఉపసంచాలకులు అనిల్ మాట్లాడుతూ..నిరక్షరాస్యులైన ఖైదీలు అందరు సంపూర్ణ అక్షరిస్యత సాధించాలనే లక్ష్యంతో ప్రారంబించిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగాపుస్తకాలు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరిడెంట్ శ్రీధర్, లక్ష్మీనారాయణ, సక్రూ, హనుమంతరావు, సుభాష్, సురేష్ పాల్గొన్నారు.

సర్కారు పాఠశాలకు సౌండ్ బాక్స్, క్రీడా సామగ్రి వితరణ



సౌండ్ బాక్స్, ఆట వస్తువులను అందిస్తున్న దాత బాలశౌరి

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రూ.30 వేల విలువ గల సౌండ్ బాక్స్, క్రీడా సామాగ్రిని అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు మరసకట్ల బాలరాజు (శౌరి) తమ వంతుగా వాటిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కారక్రమంలో పాఠశాల హెచ్ఎం నామ కృష్ణమూర్తికి దాత బాలరాజు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పసుపులేటి రాజు, మరసకట్ల కిషోర్, బొల్లెపోగు ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



వేంసూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ మంగళవారం వేంసూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో గల రికార్డులను పరిశీలించారు. అనంతరం స్వాదినం చేసుకున్న వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఎఫ్ఐఆర్‌లను పరిశీలించారు. ప్రజలకు సమర్థవంతంగా సేవలను అందించాలని సిబ్బందికి ఏసిపి సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ ముత్తులింగం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

» ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్



సత్తుపల్లిలో జ్యోతిప్రజ్వళన చేస్తున్న రాగమయి

సత్తుపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలంటే ఆదుకునే ఆపన్నహస్తంలా సీఎం రేవంత్‌రెడ్డి రూపంలో అందరికి దొరకడం ఎన్నో జన్మల పుణ్యంలా భావిస్తున్నానని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 5మండలాల్లోని 5039సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4.67కోట్ల వడ్డీలేని రుణాల చెక్కులను స్థానిక ఎమ్మార్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి పంపిణీ చేశారు. సమాజానికి మూలాధారమైన మహిళ లేనిదే మానవజాతి మనుగడ లేదన్నారు. గత బీఆర్ఎస్ 10ఏళ్ల పాలనలో డ్వాక్రా గ్రూపులకు రుణాలు కూడా ఇవ్వకుండా పక్కన పెట్టారని, కానీ కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశ్యంతో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వడ్డీలేని రుణాలు ఇచ్చి ప్రోత్సహించడాన్ని తాను సైతం సంతోషిస్తున్నానని అన్నారు. గతంలో కూడా రూ.6.59కోట్ల ఇవ్వగా ఇప్పుడు కలిపి రూ.11.26కోట్ల రుణాలు ఈ ఏడాదికి గానూ నియోజకవర్గానికి అందించామన్నారు. ఈ రుణాలను కుటుంబ అవసరాలకు ఖర్చు చేయకుండా గ్రూప్ సభ్యులంతా యూనిట్లు పెట్టుకుని ఆర్థిక స్వావలంభన సాధించే దిశగా ప్రయత్నం చేయాలని కోరారు. శిక్షణతో పాటు సలహాలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసేందుకు సంబంధిత మంత్రితో మాట్లాడగా సానుకూలంగా స్పందించారని, దీంతో ఉత్పత్తులను అమ్ముకునేందుకు స్థలం ఏర్పాటు చేస్తామన్నారు. సోలార్ యూనిట్లను మండలానికి ఒకటి చొప్పున ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఆర్టీసీ బస్సులను 4మండలాల్లో ఇవ్వగా పెట్రోల్ బంకులు ఇచ్చామన్నారు. ఇంకా ముందుకు వస్తే త్వరలో రైస్‌మిల్లులు, గోడౌన్ల నిర్వహణకు మహిళాసంఘాలకు కేటాయిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం



చెక్కు అందజేస్తున్న రాందాస్‌నాయక్

వైరా: రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంభనే ప్రభుత్వ లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.3.73కోట్ల వడ్డీలేని రుణాలను వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ఉద్దేశ్యంతో రూ.లక్షకోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. సీఎం, డిప్యూటీ సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క ఇప్పటికే రూ.27వేల కోట్ల వడ్డీ లేని రుణాలను ఇచ్చినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఏఎంసీ చైర్మన్ బోళ్ల గంగారావు, ఆత్మకమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, ఐదుమండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, స్వర్ణ నరేంద్ర, తలారి చంద్రప్రకాష్, మంగీలాల్ నాయక్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి దిశగా ట్రాన్స్‌జెండర్లు

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. ఒక్కో ట్రాన్స్‌జెండర్‌కు రూ.30వేల చొప్పున రూ.3లక్షల వరకు మంజూరయ్యాయి. వారు సరైన రీతిలో బ్యాంకు రుణాలు చెల్లించటంతో ఆ ట్రాన్స్‌జెండర్ల సంఘానికి రూ.6లక్షల రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకొస్తున్నారు. వీరిలో ఒక ట్రాన్స్‌జెండర్ ఆటో కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతుండగా మరో ట్రాన్స్‌జెండర్ శ్రావణి టీ స్టాల్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం శ్రావణి టీ స్టాల్‌ను ప్రారంభించారు. మిగతా 8మంది వివిధ వ్యాపారాలు చేసుకుంటున్నారు. కాగా ఆయా సంఘంలోని సభ్యులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకం, బ్యాంకర్ల సహకారంతో స్వయం ఉపాధి పొందుతున్నామని, ఖమ్మం మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకు రుణాలు మంజూరు కావటంతో సమాజంలో తమకు మంచి గుర్తింపు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎస్‌కే సల్మా పాల్గొన్నారు.

డీసీసీ నూతన, మాజీ అధ్యక్షులకు సన్మానం



సత్యనారాయణ, దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వైరా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైరాలో మంగళవారం కొత్తగా నియమితులైన డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, తాజా మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లను రెండోవార్డు మాజీ కౌన్సిలర్ బత్తుల గీత, శ్రీనివాసరావు దంపతులు సన్మానించారు. ఆత్మకమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, నాయకులు మట్టూరి కృష్ణారావు, పొదిల హరినాథ్, గొల్లపూడి కృష్ణారావు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎన్నికైన కల్లూరు పట్టణ మహిళా సమాఖ్య కార్యవర్గం

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మునిసిపాలిటీలో నూతనంగా మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మునిసిపాలిటీ పరిధిలో గల 17 గ్రామ సమాఖ్యల సమావేశం ఏర్పాటు చేయగా, ఈ సమావేశంలో ఓబి సభ్యులు, రిసోర్స్ పర్సన్లు సమన్వయంతో టీఎంసీ సుజాత ఆధ్వర్యంలో నూతన పట్టణ మహిళా సమాఖ్య ఎన్నిక ఐదుగురితో ఏర్పడింది. ఈ సమాఖ్యకు గాను స్త్రీ శక్తి మహిళా సమైక్యగా నామకరణం చేశారు. అధ్యక్షురాలుగా కంభంపాటి వెంకటలక్ష్మి, కార్యదర్శిగా చింతపల్లి రమణ, కోశాధికారిగా దరావత్ దివ్య, సహాయ కార్యదర్శిగా పెరిక ప్రియాంక, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె షహనాజ్‌లు ఎంపికయ్యారు. వీరికి గాను త్వరలో బ్యాంకు ఖాతాలు ప్రారంభించి పట్టణ స్త్రీ శక్తి సమైక్య ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధికి, జీవనోపాదుల కల్పనకు రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ నరేష్, మహిళా సమాఖ్యలు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుకు రైతుల మొగ్గు..

» పత్తితో నష్టం, ఇప్పటికే వేయ్యి ఎకరాల మక్క సాగు



కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానాకాల సీజన్‌లో వాతవరణం అనుకూలించక పోవడంతో కల్లూరు పరిసర ప్రాంతాల్లో సాగు చేసిన పత్తి పంటకు తీవ్రంగా నష్టం జరిగింది. ఇక ప్రత్యామ్నాయ పంటగా రైతులు మొక్కజొన్న సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే కల్లూరు మండల పరిసర గ్రామాలకు చెందిన పలువురు రైతులు పత్తి పొలాల్లో అధిక వర్షాలకు కుళ్లి (తెగులుతో) తీవ్రంగా నష్టం కాగా, దిగుబడి తగ్గిడంతో పత్తిని తొలిగించారు. ఇక ప్రత్యామ్నాయంగా రైతులు పొడి దుక్కిలు దున్ని ట్రాక్టర్లతో బోదేలు చేస్తూ విత్త సాగుకు సిద్దమవుతున్నారు. ఇప్పటికే మండంలో సాగర్ ఆయుకట్టు కింది, వ్యవసాయ బోర్లు, నెల బావులను ఆధారంగా చేసుకుని సుమారు 100 ఎకరాల్లో ఈ సీజన్‌లో నూతంగా మక్క విత్తనం నాటారు. ఇంకాను పలు గ్రామాల్లో రైతులు మక్క సాగుపై దృష్టి సారిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మెట్ట భూముల్లో పత్తి సుమారు 4 వేల ఎకరాల్లో సాగువుతుండగా తీవ్ర నష్టం జరగడంతో ప్రత్యామ్నాయంగా మక్క సాగుపై రైతులు ఆశతో ఉన్నారు. పత్తి సాగుకు గాను అసలు రైతులు ఎకరాకి రూ.35 వేలు పెట్టుబడులు పెట్టగా, కౌలు రైతులు కౌలు బాబతు గాను ఎకరాకి రూ.70 వేలు చెల్లించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో అధిక వర్షాలతో దిగుబడి తగ్గడంతో రైతులు పెట్టుబడులు ఆశించనంతగా రాక ఆందోళన చెందుతున్నారు. ఇక కౌలు రైతులకు పెట్టుబడులు రాక విలవిల లాడుతున్నారు. మండలంలోని దారుకబంజర, చిన్నకోరుకొండి, తెలగారం, మర్లపాడు, తాళ్లూరి వెంకటాపురం, బత్తులపల్లి, కప్పలబంధం తదితర గ్రామాల్లో రైతులు తమ మెట్ట భూముల్లో సాగులో ఉండి కుళ్లిన పత్తిని కూలీల చేత తొలిగించారు. ప్రత్యామ్నాయంగా బాధిత రైతులు పలు రకాల విత్తన కంపెనీలతో ఒప్పందం చేసుకుని విత్తన సాగుకు సిద్దమవుతున్నారు. గత ఏడాది కల్లూరు ప్రాంతంలో మక్క సాగు చేసి లాభదాయకం కలిగిన రైతులతో పాటుగా ఎక్కువ శాతం మంది రైతులు కొత్తగా మక్క సాగుకు సిద్దమతున్నారు. మరో వైపున వ్యవసాయశాఖ తరపున కూడా పలు గ్రామాల్లో మక్క సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు.

పత్తిని తొలిగించి మక్కలు వేస్తున్నాం

ఎస్‌కే ఖాదర్, దారుక బంజర



ఈ వానాకాలం సీజన్‌లో అధిక వర్షాలతో పత్తి సాగు చేసి తీవ్రంగా నష్టపోయాం. దిగుబడి అరకొరగా రావడంతో పెట్టుబడులు దక్కని పరిస్థితి. మరో రెండు నెలలు పత్తి సాగుకు కాల పరిమితి ఉన్నప్పటికి ఆశాజనకంగా పత్తి దిగుబడి రానందున అర్థాంతరంగా పత్తిని తొలిగించి ప్రత్యామ్నాయంగా మక్క సాగు చేస్తున్నాం. ఇప్పటికే మక్క కంపెనీలు రైతులతో ఒప్పందం చేసుకున్నాయి. విత్తనాలతో పాటుగా ఎకరాకు రూ.20 వేలు అడ్వాన్స్‌గా కూడా రైతులకు అందించారు. సాగర్ జలాలు, వ్యసాయ బోర్లను ఆధారంగా చేసుకుని మక్క సాగు చేపడుతున్నాం. దారుక బంజరలో ఈ సీజన్లో కొత్తగా 100 ఎకరాలకు పైగా మొక్కజొన్న విత్తనాలు నాటారు. మూడు నెలల్లో పంట దిగుబడి వస్తుందన్న ఆశతో మక్కపై మొగ్గు చూపాం.

లక్ష్మీనర్సమ్మకు పలువురి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ముదిగొండ , నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముదిగొండకు చెందిన సీనియర్ పాత్రికేయుడు మల్లిక్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. మంగళవారం ఆమె భౌతిక కాయానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అలాగే సత్తపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లిక్ కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి, సంతాపం తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ జడ్పీటీసీ మందరపు నాగేశ్వరావు, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, రమేష్, బంకా మల్లయ్య ఉన్నారు.

కూలిన వంతెన పిల్లర్ పరిశీలన

» డిప్యూటీ సీఎం ఆదేశాలతో.. అధికారుల్లో చలనం



వైరా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమ స్వగ్రామం అయిన స్నానాల లక్ష్మీపురం వద్ద వైరా నదిపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పిల్లర్ కుప్పకూలిపోవడంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్‌అండ్‌బీశాఖపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. భట్టి విక్రమార్క ఆదేశాలతో మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులు కుప్పకూలిన పిల్లర్‌ను పరిశీలించారు. మండలంలోని సిరిపురం-స్నానాల లక్ష్మీపురం గ్రామాల మధ్యనున్న వైరా నదిపై హైలెవల్ వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. సోమవారం ఈ హైలెవల్ వంతెన ఒక పిల్లర్ కుప్పకూలిపోయింది. దాంతో భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి పిల్లర్ కూలిపోవడానికి కారణాలపై విచారించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యాకోబు, డిప్యూటీ ఎస్ఈ బషీర్, ఈఈ పవర్‌లు కూలిపోయిన పిల్లర్ ప్రాంతాన్ని, నిర్మాణంలో ఉన్న ఇతర వంతెన పనులను పరిశీలించారు. అయితే పిల్లర్ కూలిపోవడానికిగల కారణాలపై అధికారులు ఎలాంటి ప్రకటనచేయలేదు.

వైభవంగా హోమాలు



హోమంలోపాల్గొన్న భక్తులు

తల్లాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని రామలింగేశ్వర స్వామి వారి దేవాలయం నందు మంగళవారం లక్ష్మీగణపతి నవగ్రహ నక్షత్ర హోమములు వైభవంగానిర్వహించారు. ఆయల అర్చకుడు కంచల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో మూలమంత్ర, రుద్ర చండీ హమోమం, ప్రభూతిబలి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ



ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ

ఏన్కూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం ఇదిరానగర్‌కాలనీలో మంగళవారం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ప్రగతి గ్రామసమాఖ్య ఆధ్వర్యంలో చీరలను మహిళలకు అందించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కందుకకూరి శ్యాంకుమార్, సీసీ జరుపుల వెంకటేశ్వర్లు, గ్రామదీపిక ప్రసన్న, అకౌంటెంట్ గోపి పాల్గొన్నారు.

కొత్త చట్టాలతో కార్మికుల సంక్షేమం మెరుగు

» సింగరేణి డీడీఎంఎస్ నాగుల్‌మీరా



జేవీఆర్ ఓసీ వర్క్‌షాప్‌లో అవగాహన కల్పిస్తున్న డీడీఎంఎస్, జీఎంలు

సత్తుపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్త చట్టాలు అమలులోకి రావడంతో కార్మిక నిబంధనలు, సంక్షేమం మెరుగవుతుందని సింగరేణి డీడీఎంఎస్ నాగుల్‌మీరా అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 4లేబర్‌కోడ్‌లపై సత్తుపల్లి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం స్థానిక జేవీఆర్ ఓసీ బేస్ వర్క్‌షాప్‌లో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి పరమైన భద్రత, హెల్త్, పని ప్రదేశంలో పరిస్థితుల కోడ్ 2020 గురించి వివరించారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా మారుతున్న పరిస్థితులు, పనితీరుకు అనుగుణంగా శ్రామిక వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ కార్మిక చట్టాల సంస్కరణ లక్ష్యమన్నారు. పీఓ ఎన్‌వీఆర్.ప్రహ్లాద్, పీఈ డీ.శ్రీనివాసరావు, బీ.రాజేశ్వరరావు, వెల్ఫేర్ ఆఫీసర్ కే.శ్రీనివాస్, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాల పట్ల నిరసన



సత్తుపల్లిలో నిరసన తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

సత్తుపల్లిరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా సత్తుపల్లి మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2021డిసెంబర్ 9న రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తోందని, వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ సెక్టార్లకు అప్పగించిందని, కార్మికుల ఎన్నోఏళ్ల శ్రమ ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ నేడు 4లేబర్ కోడ్‌లను అమలు చేయడం ప్రజావ్యతిరేక నిర్ణయాల్లో భాగమే అన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనఖీ



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

చింతకాని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి రామారావు బుధవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. సందర్భంగా ఆసుపత్రిలో వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరాతీశారు. ఆరోగ్య కార్యక్రమాల పై ఇచ్చిన టార్గెట్‌లను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అల్తాఫ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

చింతకాని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు అండగా నిలుస్తుందని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పలువురు లబ్దిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మీ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాల అందిస్తుందని, మహిళల ఆర్థిక స్వాలంభనకు కృషి చేస్తుందన్నారు. తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, నాగులవంచ సొసైటీ చైర్మన్ శేషగిరి పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన కల్పించాలి



రైతులకు కరపత్రం అందిస్తున్న ఖాసీం

కొణిజర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆడ, మగ మొక్కజొన్న విత్తనాలు సాగుచేసే రైతులు ముందుగానే కంపెనీతో అగ్రిమెంట్లు చేసుకునే విధంగా వ్యవసాయాధికారులు జోక్యం చేసుకుని రైతులకు అవగాహన కల్పించాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకడు ఎస్‌కే ఖాసీం తెలిపారు. మంగళవారం ఆయన కొణిజర్ల, మల్లుపల్లి, రామనరసయ్యనగర్, తీగల బంజర, సిద్దిక్‌నాగర్, సింగరాయపాలెం గ్రామాల్లో రైతులు, కూలీలతో కలిసి కరపత్రాలు ద్వారా అవగాహన కలిగించారు. ఆడ, మగ మొక్కజన్న విత్తన పంటను సాగుచేసే రైతులు విత్తన కంపెనీల ఆర్గనైజర్లతో స్పష్టమైన అగ్రిమెంట్ చేసుకునే విధంగా అధికారులు కృషిచేయాలని కోరారు. అధికారులు రైతులకు ఆదిలోనే అండగా ఉంటే రైతులు నష్టపోకుండా ఉంటారని తెలిపారు.

డిసెంబరు మొదటి వారంలో నీటి విడుదల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ ఆయకట్టులో యాసంగి సాగుకు డిసెంబరు మొదటివారంలో నీరు విడుదదల చేస్తామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ప్రకటించారు. వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో మంగళవారం అఖిలపక్ష నాయకులు, రైతులు, నీటిపారుదలశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉందని అందువలన రబీ సాగుకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. వచ్చేనెల మొదటి వారంలో కుడి, ఎడమకాల్వలకు నీరు విడుదల చేస్తామని ప్రకటించారు. నీటిపారుదలశాఖ డీఈఈ పి.శ్రీనివాస్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఏఎంసీ చైర్మన్ బోళ్ల గంగారావు, ఆత్మకమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, టీడీపీ నియోజకవర్గ బాధ్యుడు చెరుకూరి చలపతిరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ జైపాల్ పాల్గొన్నారు.

బీసీలపై రాజకీయ వివక్షత దుర్మార్గం

» బీసీ జేఏసీ నాయకులు కృష్ణ, సుగుణారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుండాల కృష్ణ, సుగుణారావు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీలపై రాజకీయ వివక్షత దుర్మార్గమని, బీసీలకు 22శాతం రిజర్వేషన్లను పటిష్టంగా అమలుచేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు గుండాల కృష్ణ , మేకల సుగుణారావు అన్నారు. మంగళవారం ఖమ్మంనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరులసమావేశంలో వారు మాట్లాడుతూ.. బీసీలకు 22శాతం రిజర్వేషన్లు అమలుచేయకుండా 11.7శాతం అమలు చేసేందుకు ప్రయత్నిస్తూ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. జీవో 46ప్రకారం బీసీలకు 22శాతం రిజర్వేషన్ అమలుచేయకుండా 11.7శాతం రిజర్వేషణ్లు అమలు చేయడం దారుణమన్నారు. అన్ని రాజకీయపక్షాలు బీసీ రిజర్వేషన్లపై స్పందంచాలని కోరారు. రఘునాధపాలెం, తిరుమలాయపాలెం మండలాల్లో సగానికిపైగా ఉన్న బీసీలకు ఒక్క రిజర్వేషన్‌కూడా ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు,, కలెక్టర్ బీసీ రిజర్వేషన్లపై పునరాలోచన చేసి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈవిలేకరుల సమావేశంలో పిట్టల నాగేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, పెరుగు వెంకటరమణ, గీత, హనుమంతు, చైతన్య పాల్గొన్నారు.